




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

కర్నూలు నంద్యాల

శనివారం | 02 ఆగస్టు 2025


పేజీలు 8


# భూ బకాసురులు..!!

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** ప్రభుత్వ భూములు తమ పేర రాసేసుకున్నారు. పేదల అసైన్డ్ భూముల్లో అక్రమాలకు పాల్పడి పాగా వేశారు. చేజిక్కించుకున్న భూములను అమ్మి కోట్లకు పడగలెత్తారు. ప్రభుత్వాలు ఏవైనా సరే వారి అక్రమాల పరంపర మాత్రం కొనసాగుతూనే వస్తుంది. దాదాపు రెండు దశాబ్దాల నుంచి జరిగిన సుమారు వంద ఎకరాల భూ దోపిడి ఆ ఇద్దరి కనుసన్నల్లోనే పాత్రదారులు ఎవ్వరైనా సరే సూత్రదారులు మాత్రం ఆ ఇద్దరే..డోన్ మండలంలోని వెంకటాపురం, ఉడుములపాడు, జగదూర్తి గ్రామాల పరిధిలో భారీగా ప్రభుత్వ భూముల దోపిడి జరిగినట్లు తెలుస్తోంది. దశాబ్దాల నుంచి జరుగుతున్న భూ అక్రమాలకు మూలం మాత్రం ఆ ఇద్దరే. రెవెన్యూ శాఖపై తమ పెద్దలకున్న పట్టును ఒడిసిపట్టుకున్న ఆ సోదరులు సుమారు వంద ఎకరాల్లో భూ రికార్డులను తారుమారు చేసినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగి అయినటువంటి తమ కుటంబ సభ్యుల పేరు మీద కూడా దాదాపు 30ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయంటే వారి అక్రమాల పర్వం ఏవిధంగా కొనసాగిందో ఇట్టే తెలిసిపోతుంది. గతంలో పెత్తందారి కుటుంబ నేపధ్యం కలిగి ఉండటంతో ఆయా గ్రామాలలో వారి భూ దందాకు ఎదురులేకుండా పోయింది. అంతేకాకుండా ఆయా గ్రామాలలో రాజకీయ నాయకులుగా చెలామణి

మిగతా 2లో

- పరాధీనంలో ప్రభుత్వ భూములు
- సూత్రధారులు ఆ ఇద్దరే..? పాత్రధారులు మరెందరో..
- వెలుగులోకి వస్తున్న అక్రమాలు
- తీగ లాగేదెవ్వరు..? డొంక కదిలేదెప్పుడు..?



## ఓర్వకల్లులో రూ.15వేల కోట్ల
# పెట్టుబడులు

- 6,682 మందికి ప్రత్యక్ష ఉపాధి
- 1448 ఎకరాల్లో 7 భారీ పరిశ్రమలు
- త్వరలో జైరాజ్ ఇస్పాత్ ప్రారంభం
- కర్నూలు జిల్లాలో పారిశ్రామిక ప్రగతి
- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు పెద్ద ఎత్తున పరిశ్రమలు రానున్నట్లు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో ఏర్పాటు కానున్న పరిశ్రమల వివరాలు తెలిపారు. 14,806.92 కోట్ల రూపాయల పెట్టుబడులతో 7 భారీ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని కలెక్టర్ తెలిపారు. ఆయా పరిశ్రమలకు 1448 ఎకరాల భూమి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈ పరిశ్రమలతో 6,682 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు. పరోక్షంగా మరికొంత మందికి ఉపాధి లభిస్తుందని ఆయన చెప్పారు.

మిగతా 2లో

### పోలీస్ కానిస్టేబుళ్ల తుది ఫలితాలు
# విడుదల

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** రాష్ట్రవ్యాప్తంగా 6,100 పోలీస్ కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి సంబంధించి తుది ఫలితాలు శుక్రవారం విడుదల అయ్యాయి. మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో హోంమంత్రి అనిత వీటిని విడుదల చేశారు. ఏపిలో 6,100 కానిస్టేబుళ్ల ఉద్యోగాలు భర్తీ చేయడానికి 2022 జనవరి 22న ప్రిలిమినరీ రాత పరీక్ష నిర్వహించారు. ఈఫలితాలలోఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన

మిగతా 2లో

# కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్ళు

- 8 గేట్ల ద్వారా సాగర్ వైపు పరుగులు

**కర్నూలు/శ్రీశైలం, మేజర్‌న్యూస్‌బ్యూరో :** కృష్ణానదిలో వరద ఉధృతి కొనసాగుతోంది. 8 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ నాగార్జున సాగర్‌వైపు తరలివెళుతోంది. 10 అడుగుల ఎత్తున 8 గేట్ల గుండా ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ పరుగులు చూసేందుకు రెండు కళ్లూ సరిపోవడం లేదు. పాలనురగను తలపించేలా డ్యాం నుండి దిగువకు దూకుతున్న కృష్ణమ్మను చూసేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున శ్రీశైలం వస్తున్నారు. నేడు శనివారం, రేపు ఆదివారం కావడంతో పర్యాటకుల సంఖ్య పోటెత్తనుంది. ఒకవైపు పాలసంద్రం లాంటి కృష్ణమ్మ, మరోవైపు జనసంద్రం శ్రీశైలాన్ని ముంచెత్తబోతోంది. 885 అడుగుల పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న శ్రీశైలం డ్యాంలో శుక్రవారం సాయంకాలానికి 882.50 అడుగుల మేర నీటి నిల్వలుండగా,

మిగతా 2లో



### పందికోన పెండింగ్ పనుల కోసం
# రూ.210 కోట్లు

- ఆర్డీఎస్,వేదవతి పనులు చేసేందుకు అనుమతించిన ప్రభుత్వం
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్న కలెక్టర్



రిజర్వాయర్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

### పేదలకు సాయం
# ఎంతో సంతృప్తి

- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం పేదల బతుకుల్లో వెలుగులు నింపేలా పీ4 విధానాన్ని అమలు చేస్తోందని పీ-4 స్ఫూర్తిని ప్రజల్లోకి బలంగా తీసుకుని వెళ్లి పేదలు, ధనికుల మధ్య అంతరాలు తగ్గించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్

మిగతా 2లో


పెన్షన్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి గణియా

# పింఛన్లకు రూ.103 కోట్లు

- జిల్లాలో 3,502 మంది వితంతువులకు కొత్తగా పింఛన్లు
- పత్తికొండ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసిన కలెక్టర్,ఎమ్మెల్యే శ్యాం



లబ్ధిదారలకు పెన్షన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్,ఎమ్మెల్యే

సూర్య



# ఓర్వకల్లులో రూ.15వేల కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

2,938 కోట్ల రూపాయలతో నిర్మాణం పూర్తి చేసుకున్న జైరాజ్ ఇస్పాత్ లిమిటెడ్ కంపెనీ త్వరలోనే ప్రారంభం అవుతుందని ఆయన చెప్పారు. 413 ఎకరాల్లో విస్తరించిన ఈ పరిశ్రమలో 1,030 మందికి ఉపాధి లభిస్తుందని ఆయన చెప్పారు. 285 కోట్ల రూపాయల పెట్టుబడితో 850 మందికి ఉపాధి కల్పించే సిగాచీ ఇండస్ట్రీస్ 25 ఎకరాల్లో ఏర్పాటవుతుందని చెప్పారు. 105 ఎకరాల్లో ప్యూర్ ఎనర్జీ సంస్థ ఎలక్ట్రానిక్స్ ద్విచక్ర వాహనాల తయారీ పరిశ్రమ కూడా ఏర్పాటు కాబోతోందని ఆయన చెప్పారు. 1286 కోట్ల రూపాయల పెట్టుబడితో 1200 మందికి ఉపాధి లభించబోతోందని ఆయన తెలిపారు. 1622 కోట్ల రూపాయల పెట్టుబడితో రిలయన్స్ కన్స్యూమర్ ప్రాడక్ట్స్ లిమిటెడ్ కంపెనీకి 80 ఎకరాల స్థలం కేటాయించామని, 1200 మందికి ఉపాధి కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయని ఆయన వివరించారు. 300 ఎకరాల్లో 7వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో డ్రోన్ కార్పొరేషన్ ఏర్పాటు కానుందని, ఈ పరిశ్రమతో వెయ్యి మందికి ఉపాధి దొరుకుతుందని ఆయన చెప్పారు. అగస్త్య సోలార్ కంపెనీ ఆధ్వర్యంలో 111.66 ఎకరాల్లో 7వేల కోట్ల రూపాయల పెట్టుబడితో సోలార్ ప్యానెల్స్ తయారు చేసే పరిశ్రమ ఏర్పాటు కాబోతోందని, దీని వల్ల వెయ్యి మందికి ఉపాధి దొరుకుతుందని ఆయన చెప్పారు. ఈ-మొబిలిటి బ్యాటరీల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతోందని, 245.66 ఎకరాల్లో వెయ్యి కోట్ల పెట్టుబడితో వెయ్యి మందికి ఉపాధి కల్పించేలా ఈ పరిశ్రమ ఏర్పాటు అవుతుందని ఆయన చెప్పారు. సెన్సారెమ్ ఫోటోనిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 25 ఎకరాల్లో చిత్ర ఇమేజ్ అండ్ ఇన్‌ఫ్రా రెడ్ మాడ్యూల్స్ తయారీకి 1,057.92 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టనుందని, 622 మందికి ఉపాధి లభిస్తుందని ఆయన చెప్పారు. 100 ఎకరాల్లో 1500 కోట్ల రూపాయల పెట్టుబడితో సింథటిక్ ఆర్గానిక్స్ కెమికల్స్ తయారు చేసేందుకు సిగాచీ ఇండస్ట్రీస్ ముందుకు వచ్చిందని, 980 మందికి ఉపాధి లభిస్తుందని ఆయన చెప్పారు.

# పందికోన పెండింగ్ పనుల కోసం రూ. 210 కోట్లు

**కర్నూలు/పత్తికొండ, మేజర్‌న్యూస్‌బ్యూరో :**

పందికోన రిజర్వాయర్ పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు 210 కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన పత్తికొండ మండలం దూదేకొండ సమీపంలోని పందికోన రిజర్వాయర్‌ను పరిశీలించారు. పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు కూడా ఆయనతో ఉన్నారు. పెండింగ్ పనులు పూర్తయితే 40వేల ఎకరాలకు అదనంగా సాగునీరు అందు తుందని కలెక్టర్ చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల్లో కూడా తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న వేదవతి, ఆర్డీఎస్ పనులు కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ వెడల్పు పనులు పూర్తి చేశామని, గతంలో 2100 క్యూసెక్‌ల సామర్థ్యం ఉన్న కాలువను 3,500 క్యూసెక్‌లకు పెంచామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా జిల్లాలోని చెరువులను పూర్తి స్థాయిలో నింపి, త్రాగునీటి సమస్య రాకుండా చేశామన్నారు. గత ఏడాది లాగే ఈ ఏడాది కూడా అన్ని చెరువులను నింపుతున్నామన్నారు. ఆయన వెంట పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ పాండురంగయ్య, ఈఈ గుణకర్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఎన్.ప్రసాదరావు, తహశీల్దార్ హుస్సేన్‌సాహెబ్, ఎంపిడిఓ కవిత, డిఈఈ, ఏఈలు ఉన్నారు.

# పేదలకు సాయం..ఎంతో సంతృప్తి

(మొదటి పేజీ తరువాయి)

రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ నంద్యాల పట్టణంలోని 15వ వార్డు గోపాల్‌నగర్‌లో అవ్వతాతలకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా నంద్యాల పట్టణంలోని గోపాల్‌నగర్ 15వ వార్డులో నివాసం ఉన్న 75 సంవత్సరాలు ఒంటరి మహిళకు కలెక్టర్ రూ.4వేలు పెన్షన్ అందజేస్తూ వారి ఇంటిని సందర్శించారు. తులసమ్మ కుటు౦బ పేద పరిస్థితిని చూసి జిల్లా కలెక్టర్ చలించిపోయి ఆమె కుటుంబాన్ని దత్తత తీసుకుంటున్న ట్లు తులసమ్మకు తెలిపారు. గతంలో చెంచుగూడెంలోని నెమలికుంటలో జిల్లా కలె క్టర్ 29 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. నేడు గోపాల్‌నగర్‌లోని తులసమ్మ కుటుంబాని దత్తత తీసుకుని ఈ 30బంగారు కుటుంబాలకు జీవనోపాధి, ఆరోగ్య విషయాలు, వారి పిల్లల చదువులు, ఇతర అవసరాలను అడిగి తెలుసుకుని వారి వంట సామానులు, దోమతెరలు, బెడ్‌సీట్లు అందజేశారు. పేదలకు సాయం చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని జిల్లాలోని మరింత మంది మార్గదర్శకులు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుని వారి ఉన్నతికి కృషి చేయాలన్నారు.

**79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించండి :** ఈనెల 15వ తేదీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేడుక లను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు ప్రజలలో దేశభక్తి భావాలు పెంపొందించేలా ఏర్పాట్లను చేయాలన్నారు. ఆహ్వాన పత్రికలను ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులకు ప్రతి ఒక్కరికి రెండు రోజులు ముందుగానే పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో డీఆర్వో రామునాయక్, అధికారులు పాల్గొన్నారు.

# 24గంటల్లో కిడ్నాప్ కేసు చేధించిన పోలీసులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః**

ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్కంధ వెంచర్‌లో నివాసముంటున్న తెలుగు మోక్షిత్ అనే పదేళ్ల బాలుడు కిడ్నాప్‌కు గురవ్వగా ఉలిందకొండ పోలీసులు 24గంటల్లో చేధించి బాలుడిని తల్లిదండ్రుల వద్దకు చేర్చినట్లు కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్ష్మీపురం గ్రామంలో రామకృష్ణా విద్యామందిర్‌లో తెలుగు మోక్షిత్ ఐదవ తరగతి చదువుతున్నాడు. అయితే రోజుమాదిరిగానే గురువారం మధ్యాహ్నం 12గంటలకు ఇంటికి వచ్చి భోజనం చేసి తిరిగి స్కూల్‌కు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి తిరిగి రాలేదని బాలుడి తల్లిదండ్రులు సురేష్, విజయలక్ష్మిలు ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని తెలిపారు. బాలుడిని విజయలక్ష్మి తన సొంత చెల్లెళ్లు రాణి, జ్యోతిలు ఎత్తుకెళ్లింటారని ఫిర్యాదులో పేర్కొనడంతో ఆ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. కర్నూలు రూరల్ సిఐ చంద్రబాబునాయుడు, ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ, నాగలాపురం ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డిలు రెండు టీంలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారని తెలిపారు. బాలుడి ఇంటిలోనే నివాసముంటున్న వెల్దుర్తి మండలం మల్లెపల్లె గ్రామానికి చెందిన మనోహర్ నాయుడుపై అనుమానంతో అతనిపై నిఘా పెట్టగా శుక్రవారం సదరు మనోహర్ నాయుడు వెల్దుర్తి వైపు నుండి వెళ్తున్నాడన్న సమాచారంతో అతడిని వెంబడించడంతో సాయంత్రం 4.30గంటలకు వెల్దుర్తి రైల్వే స్టేషన్ ఎదురుగా క్రిష్ణగిరి టర్నింగ్ నుండి కర్నూలుకు వచ్చే దారిలో మోక్షిత్‌ను మనోహర్ నాయుడు కారులో పెట్టి ఉంచడాన్ని గమనించి దాడి చేసి బాలుడిని స్వాధీనం చేసుకుని మనోహర్ నాయుడును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కుటుంబ కలహాల కారణంగానే ఈ కిడ్నాప్ జరిగిందని డిఎస్పీ తెలిపారు.



నింధితుడి అరెస్టు చూపుతున్న డిఎస్పీ

# భూ బకాసురులు..!!

(మొదటి పేజీ తరువాయి)

అవుతున్న వారి బంధుగణం అక్రమాలకు వంతపాడటంతో పనికాస్తా మరింత సులువుగా మారింది. బంధువులకు సైతం కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను సొంత జాగీరులా దారాదత్తం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు భూములను ఎరగా చూపి వారిని మచ్చిక చేసుకోవడం వారికి వెన్నతోపెట్టిన విద్య. ఆయా గ్రామాలలో జరిగిన ఏ భూ అక్రమాలలోనైనా సరే మూలాలు మాత్రం వారివేనన్నది సుస్పష్టం. బడుగుబలహీన వర్గాలకు చెందిన అసైన్డ్ భూములను సైతం చట్టాలలోని లొసుగులతో చేజిక్కించుకున్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న భూ చట్టాలతో అక్రమాలను సక్రమంగా చేసుకోవడంలో వారు ఆరితేరారట. డోన్ పట్టణ సమీపాన ఉన్న ఆయా గ్రామాలలో భూముల ధరలు నానాటికి పెరిగిపోవడంతో చేజిక్కించుకున్న ప్రభుత్వ భూములలో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి అమ్మి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు అటువైపు కూడా చూడట్లేదు. పలుమార్లు సదరు భూ అక్రమాలపై రెవెన్యూ అధికారుల దృష్టికి ఫిర్యాదులు అందినప్పటికీ అవన్నీ సర్దుబాట్లతోనే సరిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల వెంకటాపురం గ్రామ పరిధిలోని తమ 50 ఎకరాల భూములు అన్యాక్రాంతం అయ్యాయని కొంతమంది రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వాటిపై అధికారులు ఆరా తీయడంతో అసలు నిజాలు బయటకు వచ్చాయట. గత వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామానికి చెందిన ముగ్గురు నాయకులు ఆ భూములను అక్రమంగా రికార్డులలో నమోదు చేసుకొని ఎకరా రూ.7లక్షల చొప్పున అమ్మేశారని తెలుస్తోంది. అయితే సదరు నిర్వాకం వెనుక కూడా ఆ సోదరుల హస్తం ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా హైదరాబాద్‌కు చెందిన ఓ బినామీ పేరిట 30 ఎకరాలు రికార్డుల్లో పొందుపరచి అమ్మి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. ఆయా గ్రామాలలో జరిగిన భూ అక్రమాలపై సమగ్ర విచారణ చేపడితే భారీ ఎత్తున అవకతవకలు బహిర్గతం అయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆ భూ బకాసురుల భూ దందాపై దృష్టి సారించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు

(మొదటి పేజీ తరువాయి)

రెండు తెలుగు రాష్ట్రాలు పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నా యి. డ్యాంలోకి జూరాల నుండి విద్యుత్ ఉత్పత్తి అనంతరం 23,607 క్యూసెక్‌ల నీరు వచ్చి చేరు తోండగా, స్పిల్ వే ద్వారా 1,85,459 క్యూసెక్‌లు, సుంకేసుల బ్యారేజ్ (తుంగభద్ర నది నుండి) ద్వారా 43,494 క్యూసెక్‌ల వరద నీరు వస్తోంది. డ్యాంలోకి 3,17,980 క్యూసెక్‌ల వరద నీరు వస్తోండగా, 8 గేట్ల ద్వారా 2,15,424 క్యూసెక్‌ల నీరు సాగర్‌కు తరలివెళుతోంది. విద్యుత్ ఉత్పత్తి కోసం రెండు తెలుగు రాష్ట్రాలు 65,592 క్యూసెక్‌ల నీరు వినియోగిస్తుండగా, కుడి వైపు 30,277 క్యూసెక్‌లు, ఎడమ వైపు 35,315 క్యూసెక్‌లు వినియోగిస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ జిల్లాలకు 35వేల క్యూసెక్‌ల వరద నీరు తరలిస్తున్నారు. హెచ్ఎన్ఎస్ఎస్‌కు 3,140 క్యూసెక్‌లు, మహాత్మా గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 1600 క్యూసెక్‌లు విడుదల చేస్తున్నారు. డ్యాంలోకి 3,17,980 క్యూసెక్‌ల వరద నీరు వచ్చి చేరుతోండగా, 3,26,100 క్యూసెక్‌ల నీరు బయటకు వెళుతోంది. ప్రస్తుతం డ్యాంలో 882.60 అడుగుల మేర నిల్వ ఉంది.

# పోలీస్ కానిస్టేబుళ్ల తుది ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

281మంది అభ్యర్థులు సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల ప్రకారం 6,100పోస్టుల్లో 3580 సివిల్ కానిస్టేబుళ్లు, 2520 ఏపి ఎస్పీ పోస్టులు, ఏపి ఎస్పీ కానిస్టేబుల్ 2520పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా శ్రీకాకుళం, చిత్తూరు, ప్రకాశం, రాజమండ్రి, ఏపిఎస్‌పి బెటాలియన్‌లకు అభ్యర్థులను ఎంపిక చేశారు.

# పింఛన్లకు రూ.103 కోట్లు

**కర్నూలు/పత్తికొండ, మేజర్‌న్యూస్‌బ్యూరో :** కర్నూలు జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద 2,39,491 మందికి 103 కోట్ల రూపాయలను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా చెప్పారు. శుక్రవారం పత్తికొండ మండలం దూదేకొండ గ్రామంలో రామాంజినమ్మ, షేకమ్మ, సంజమ్మ, రంగమ్మ, మద్దిలేటమ్మలకు వితంతు పింఛన్లను ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబుతో కలిసి పింఛన్లను లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా జిల్లాలో 3,502 మంది వితంతువులకు 1.40 కోట్ల రూపాయల పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రతి నెల 1వ తేదీన పింఛన్ల పంపిణీ ప్రభుత్వం నిర్వహిస్తోందని, ఇందులో కర్నూలు జిల్లా రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉంటోందని ఆయన చెప్పారు. పింఛన్ తీసుకుంటున్న భర్త చనిపోతే భార్యకు వితంతువులు పింఛన్ ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 2,583 మందికి, పట్టణ ప్రాంతాల్లో 919 మందికి కొత్తగా వితంతు పింఛన్లు మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ః**

బనగానపల్లె మండల పరిధిలోని రాళ్లకొత్తూరు సమీపంలో శుక్రవారంనాడు రోడ్డు ప్రమాదం జరిగి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. సీతమ్మ తాండాకు చెందిన నాగునాయక్ బైక్‌పై వెలుతుండగా లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బనగానపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కానిస్టేబుల్ పరీక్షల్లో సత్తాచాటిన కోసిగి యువకులు

- కానిస్టేబుళ్ళకు 12 మంది ఎంపిక
- పేదింటి ఆణిముత్యాలు



కానిస్టేబుళ్ళకు ఎంపికైన కోసిగి మండల యువకులు

**కోసిగి మేజర్ న్యూస్:** కోసిగి మండలం నుండి కానిస్టేబుళ్ళకు కోసిగి యువకులు ఎంపిక కావడం జరిగింది. కానిస్టేబుల్ ఎంపికలో కోసిగి మండల యువకులు సత్తాచాటి 12మంది ఎంపికయ్యారు. కోసిగి గ్రామం నుండి హనుమంతరెడ్డి సివిల్, శ్రీనివాసులు సివిల్, చింతలగేని రాజశేఖర్ ఎపియస్పి, దుద్ది గ్రామం నుండి కొరవ శేఖర్ సివిల్, సజ్జలగుడ్డం గ్రామం నుండి మహాలింగ ఎపియస్పి, కోసిగి నుండి బవనాసి సత్యరాజు ఎపియస్పి, బండారి చిన్నతాయన్న ఎపియస్పి కోల్మాన్పేట, బారికి శ్రీధర్ ఎపియస్పి అగసనూరు, రవిశంకర్ సివిల్ కోసిగి, ఉస్మాన్ఘని ఎపియస్పిక జంపాపురం, ఉమాశంకర్ ఎపియస్పి జంపాపురం, అరుగోల రాజశేఖర్ ఎపియస్పి వందగల్లు గ్రామాల నుండి కానిస్టేబుళ్ళ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారు. ప్రతి కుటుంబం నుండి తల్లిదండ్రులు కష్టపడితేనే కుటుంబ పోషణ జరిగే పేదింటి నుండి వచ్చిన యువకులే ఎంపిక కావడం సంతోషకరమన్నారు. దాదాపుగా 12మంది యువకులు ఎంపిక కావడంతో మరి కొన్ని జరగబోయే ఉద్యోగ పరీక్షల్లో ఈ యువకులు ఆదర్శంగా నిలిచారని ప్రతి ఒక్కరు కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యావంతులు కొనియాడారు.

# ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం....

**- నూతన పౌజ్ వితంతు పింఛన్లు పంపిణీ - టిడిపి నాయకులు ఖాజాపీరా**



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖాజాపీరా

**ప్యాపిలి, మేజర్న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకమునుపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామనీ, ప్రజలకు ఇస్తామన్న ప్రతి పథకాన్ని అమలు చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే నూతనంగా వితంతు ఫౌజ్ పింఛన్లు అందజేస్తున్నామని సీనియర్ టిడిపి నాయకులు, ముస్లిం మైనారిటీ నాయకులు ఖాజాపీరా అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయం నందు డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్రెడ్డి ఆదేశాల మేరకు నూతనంగా మంజూరైన 21 వితంతు ఫౌజ్ పింఛన్లను అధికారుల సమక్షంలో అర్హులైన మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్లు, ఈఓ శివకుమార్గౌడ్, ఈఓఆర్డి ప్రభాకర్, ముస్లిం మైనారిటీ నాయకులు ఖాజాపీరా, మాజీ ఎంపిపి తొప్పెల శ్రీనివాసులు, కొంగనపల్లి మధు, చల్లా అనుదీప్కుమార్, ప్రిన్సిపాల్ మధు, ఎస్కె.వలి, సయ్యద్ అక్బర్వలి, బాలకృష్ణ, పుల్లయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రావణమాసం సేల్ అంటూ సైబర్ మోసాలు



**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ :** శ్రావణమాసం సేల్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం తెలిపారు. ఆకర్షణీయమైన ఆఫర్లు, డిస్కౌంట్ల పేరుతో వచ్చే సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలంటే తెలియని లింక్లను క్లిక్ చేయకూడదన్నారు. అనుమానస్పద కాల్స్, మెసేజ్లను పట్టించుకోకూడదని సూచించారు. ఆకర్షణీయమైన ఆఫర్లతో మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా సైబర్ నేరాల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. అపరిచిత లింక్లను క్లిక్ చేయవద్దని ఇలాంటి లింక్ల ద్వారా మీ వ్యక్తిగత సమాచారం తస్కరించే అవకాశం ఉందన్నారు.

# ఫోక్సో చట్టానికి లింగ బేధం లేదు



అవగాహన కల్పిస్తున్న పీజీ వైద్యులు

**కర్నూలు వైద్యం, మేజర్న్యూస్ :** ఫోక్సో చట్టానికి లింగ బేధం లేదని మైనర్లకు లైంగిక వేధింపుల నుండి రక్షణ కొరకే ఫోక్సో చట్టం ఏర్పడిందని కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ సుధా కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెఎంసి కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్మెంట్ హౌస్ సర్జన్స్ అకాడమిక్ ఆక్టివిటీలో భాగంగా హౌస్ సర్జన్ ప్రణతి, పార్వతీలు ఫోక్సో చట్టంపై పిపిటిల ద్వారా వివరించినట్లు తెలిపారు. ఫోక్సో చట్టం 2012లో అమలులోకి వచ్చిందని 18సం॥లు తక్కువ ఉన్న పిల్లలపై ఎవరైనా లైంగికంగా వేధిస్తే ఈ చట్టం వర్తిస్తుందన్నారు. ఈ చట్టం అమలుకు ప్రత్యేక అధికారులు ఉంటారని తెలిపారు. ఈ కార్యాక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సింధియా శుభప్రద, అసోసియేట్ ప్రొఫెసర్ డా. అరుణ, డా. రేణుక, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. వెంకటేశ్వర్లు, డా. రవి నాయక్, డా. నాగరాజు, డా. పుష్పలత, డా. వైష్ణవి, డా. ప్రసన్న రాణి, డిసిహెచ్ఎస్ డా. స్వర్ణకుమారి, లెక్చరర్లు సురేష్ కుమార్, సరిత, భవాని ప్రసాద్, ఎస్సార్ యాస్మిన్, పీజీలు సౌమ్య, సవ్య, ఔసర్జన్స్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు అమృతం

:- మాత శిశు సంరక్షణ మా బాధ్యత
:- ఐఎంఎస్ చట్టం పకడ్బందీగా అమలు కావాలి



మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ విజయ

**కర్నూలు వైద్యం, మేజర్న్యూస్ :** తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని ప్రాజెక్టు డైరెక్టర్ పి విజయ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి విజయ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థిరమైన మద్దతు ఇచ్చే వ్యవస్థలను ఏర్పరచింది. తల్లిపాల సంస్కృతి ప్రోత్సాహానికి ప్రాధాన్యత ఇద్దాం అనే నినాదంతో ముందుకు సాగుతున్నారన్నారు. దేశవ్యాప్తంగా 88.6 శాతం ప్రసవాలు జరుగుతున్నాయని, ముర్రుపాలు ఇచ్చే తల్లులు 41.8శాతం ఉండడం బాధాకరమన్నారు. పుట్టిన బిడ్డకు గంటలోపు ఇచ్చే తల్లిపాలు అమృతంతో సమానమన్నారు. దీనివల్ల పిల్లల్లో మేధాశక్తి నియోనియా, విరోచనాల వ్యాధుల నుండి రక్షణ ఉంటుందన్నారు. పాలిచ్చే తల్లులు గర్భాశయ, అండాశయ క్యాన్సర్ల బారిన పడరన్నారు. అందంపై ఆశతో పసిబిడ్డలకు తల్లిపాలను దూరం చేస్తూ పాల పౌడర్ పాలు అందిస్తున్నారన్నారు. ఇలా చేసే తల్లులు శిశువులకు జన్మనిచ్చి వృధా అవుతుందన్నారు. ఐఎంఎస్ చట్టం పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. తల్లి బిడ్డ అనుబంధానికి ఆరోగ్యానికి తల్లిపాలు శ్రేష్టమన్నారు. తల్లిపాల సంస్కృతిని పెంచే రక్షణలో లోపాలను అధిగమించేందుకు ఐసిడిఎస్ కట్టుబడి ఉందన్నారు. ఈ నెల 1 నుండి 7వ తేదీ వరకు ప్రతిరోజు అంగన్వాడి సెంటర్లో కార్యక్రమాలు నిర్వహిస్తామని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి విజయ్ పిలుపునిచ్చారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు, కర్నూలు, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు సిడిపిఓలు వరలక్ష్మి, అనురాధ, నరసమ్మ, రాజేశ్వరి దేవి, సఫరున్నీసబేగం, నోడల్ ఆఫీసర్ రేవతి జోస్న, ఈఓ, సూపర్వైజర్లు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత




రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి మాట్లాడుతున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్న్యూస్ :** నంద్యాల కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో బాలల సమస్యలు, విద్యాహక్కు చట్టం 2009, ఫోకో చట్టం 2012, బాలల హక్కుల చట్టం 2005పై జిల్లాస్థాయి అధికారులు, మండలస్థాయి విద్యాశాఖ అధికారులు, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి, స్త్రీ సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ అధికారులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్లు, మండల విద్యాధికారులు, కళాశాల యాజామాన్యలు పాల్గొన్నారు. ఈసందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రహారీ క్లబ్బులు, పిల్లల కమిటీలు, ఫిర్యాదు బాక్సులు, ఈగల్ క్లబ్స్, యాంటీ ర్యాగింగ్ కమిటీస్, ప్రొటెక్షన్ కమిటీ, యువ, శక్తి కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 1986లో బాలల హక్కుల కోసం 188 దేశాలు సభ్య దేశాలు ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో డిక్లరేషన్ ఆమోదించారు. అందులో మన భారతదేశం కూడా పిల్లల హక్కులకు భంగం వాటిల్లకుండా వారి పరిరక్షణ, శ్రేయస్సు, భద్రత రక్షణ, సంరక్షణను కాపాడుతామని డిక్లరేషన్ ఆమోదించడం జరిగింది. మొట్టమొదటిగా 2వేల సంవత్సరంలో బాలల న్యాయచట్ట అమలులోకి రావడం అయినది. ఈచట్ట ప్రకారం 18సంవత్సరాల లోపపు బాల బాలికల హక్కుల పరిరక్షణకు, రక్షణ, సంరక్షణకు ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ సంస్థలు కృషి చేయాలని ఆదేశించారు. అనాధ పిల్లలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని తెలిపారు. బాల్య వివాహాలు, ఆరోగ్య, పౌష్టికాహారం, బాలల సమస్యలపై డిఎంహెచ్ఓ, సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, గిరిజన సంక్షేమ అధికారులు, గిరిజన సంక్షేమ అధికారులు, సీడిపిఓలు, జిల్లాల బాలల సంరక్షణ విభాగం, ఫన్స్టాప్ సెంటర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలో అదనపు సూపరింటెండెంట్, డీఈఓ, స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారిణి లీలావతి, డిసిపిఓ స్వప్న ప్రియదర్శిని, సోషల్ వెల్ఫేర్ డిడి చింతామణి, సిడిపిఓలు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.12.52 కోట్లు ఖాతాల్లో జమ

**- వ్యవసాయ అధికారి**

**ఆదోని రూరల్, మేజర్ న్యూస్ :** అన్నదాత, పిఎం కిసాన్ పథకం కింద అర్హులైన ప్రతి రైతు ఖాతాలో రూ. 7వేల చొప్పున జమ చేస్తామని వ్యవసాయ అధికారి సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, మండలంలో మొత్తం 18,722మంది రైతల ఖాతాలో సుమారు రూ. 12.52కోట్లు జమ చేస్తామన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాగనాథనహల్లి గ్రామంలో జరిగే అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ కింద రూ. 2వేలు కలుపుకొని చెక్కులను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమాని కి ఎమ్మెల్యే పాల్గొని చెక్కులను అందజేస్తామన్నారు.

# కానిస్టేబుల్ ఫలితాలలో సత్తా చాటిన తెర్నేకల్ యువకులు

**అభినందనలు తెలిపిన సర్పంచ్ అరుణ్కుమార్**

**దేవనకొండ మేజర్ న్యూస్ :** గురువారం ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాలలో మండల ఫరిదిలోని తెర్నేకల్ గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు సత్తా చాటారు. మంచి ప్రతిభ కనబరచి పోలీసు ఉద్యోగం సాధించి మండలానికి తమ గ్రామానికి గుర్తింపు తెచ్చిన వడ్డె రవితేజ,పైయింటి మహేశ్,చాకలి వీరన్న,బెస్తా వీరేశ్,ఎరుకల రాజశేఖర్,కురువ గురుస్వామిలకు తెర్నేకల్ గ్రామ సర్పంచ్ అరుణ్కుమార్తో పాటు గ్రామ పెద్దలు,ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అరుణ్కుమార్ మాట్లాడుతూ యువకులు ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో కూడ పట్టుదల,క్రమశిక్షణతో విధ్యపై ఏకాగ్రత పెడితే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తూ నేటి యువకులు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఇందులో బాగంగా గతంలో కూడ గ్రామం నుండి ఇద్దరు యువకులు ఆర్మీకి కూడ ఎంపిక కావడం జరిగిందని తెలిపారు.

# అర్హులైన వారికి వితంతు ఫౌజ్ పింఛన్లు



**వెల్దుర్తి, మేజర్న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు అర్హులైన వితంతు మహిళలకు వితంతు ఫౌజ్ పింఛన్లను అంద జేసినట్లు మాజీ ఎంపిపి, టిడిపి సీనియర్ నాయకులు ఎల్ఈ. జ్ఞానే శ్వర్గౌడ్ అన్నారు. శుక్రవారం స్థాని క వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయితీ పరిధిలో అర్హులైన ఫౌజ్ పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కె. లక్ష్మినాథ్, ఉప సర్పంచ్ శ్వేతా నాగేంద్ర, పట్టణ కన్వీనర్ సుధాకర్గౌడ్, మాజీ జడ్పిటిసి ఐజ, ఎమ్మార్పిఎస్ నాయకులు ఎన్. గిడ్డయ్య, ఎన్. పెద్దహరి, ఎన్. చిన్నహరి, వడ్డె మహేష్, ఎన్. మోహన్, హరి, టిడిపి సీనియర్ నాయకుడు వీరభద్రుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రహదారి పనులను త్వరగా పూర్తి చేయండి



రహదారి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

**కొత్తపల్లి, మేజర్న్యూస్ :** మండలంలోని సంఘమేశ్వరం నుంచి జానాలగూడెం వరకు నిర్మాణం చేపట్టిన బిటి రోడ్డు రహదారి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య సూచించారు. శుక్రవారం సంఘమేశ్వరం నుంచి జానాలగూడెం వరకు చేపట్టిన రహదారి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ మారుమూల గుడెంలకు రూ. 4.40 కోట్ల నిధులతో 7 కి.మీల మేరా రహదారి నిర్మాణానికి నిధులు మంజూ రు చేసిందన్నారు. ఈ రోడ్డు పూర్తి అయితే ఈ మూడు గ్రామాల గిరిజనులకు, ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. గడువులోగా ఈ నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్కు సూచించారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా కోనేటి రాయుని కలశ ప్రతిష్ఠ ఉత్సవం


కలశాలు అమర్చడానికి ఏర్పాటు చేసిన మెట్లు


స్థాపనకు సిద్ధంగా ఉన్న కలశాలు


హోమంలో పాల్గొన్న భక్తులు

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** ఇంజేడు గ్రామంలో వెలసిన కోనేటి లక్ష్మి వెంకటేశ్వర ఆలయం నూతన కలశ ప్రతిష్ఠోత్సవం శుక్రవారం ఘనంగా మొదలైంది. ఈ వేడుకలు మూడు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇంజేడు గ్రామంలో 1976 సంవత్సరంలో పునఃనిర్మించిన ఈ ఆలయాన్ని ప్రతి శనివారం వందలాది మంది భక్తులు తరలి వచ్చి దర్శించుకుంటారు. ప్రతి సంవత్సరం ముక్కోటి ఏకాదశి రోజున భక్తులకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, కళ్యాణోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. గోపురం ఉన్నప్పటికీ కలశాలు లేకపోవడంతో గాలి గోపురంతో పాటు కలశాలను నిర్మించ డానికి వైకాపా మండల అధ్యక్షుడు ఇంజేడు గ్రామ నివాసి గజ్జల కృష్ణారెడ్డి తన సొంత నిధులు రూ.20 లక్షలు వెచ్చించి, మరో రూ.41 లక్షలు దాతల నుంచి విరాళాలు సేకరించి ఆలయ ముఖ ద్వారంపై రాజ గోపురం నిర్మించాడు. ఈ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మహా గణపతి పూజ, రక్షాబంధనం, పంచగవ్య ప్రసాదం, యాగశాల ప్రవేశం, హోమాలు, జలాది వాసం, తదితర కార్యక్రమాలు చేపట్టారు. 2వ తేదీ శనివారం ఉదయం ప్రాతఃకాల పూజ, పంచహోమాలు, సయ్యాదివాసం, మహామంగళ హారతి, 3వ తేదీ ఆదివారం కుంబాభిషేకం, శిఖర ప్రతిష్ట, కూష్మాండబలి, పూర్ణాహుతి, కంకణ విసర్జన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదునిక టెక్నాలజీతో నిర్మించిన రాజగోపురాన్ని, దేవాలయాన్ని విద్యుత్ అలంకారణలతో చక్కగా అలంకరించారు. ఈ వేడుకల్లో పాల్గొనడానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యం కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

# వైభవంగా సవదత్తి రేణుకా యల్లమ్మదేవి కుంభోత్సవ వేడుకలు


కుంభోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


సవదత్తి యల్లమ్మ దేవి

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** హొళగుందలోని కొలువుదీరిన ఇలవేల్పు..ఆరాధ్య ధైవం.. శ్రీ సవదత్తి రేణుకా యల్లమ్మ దేవి కుంభోత్సవ వేడుకలు శుక్రవారం తోటద కుంటుబ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. స్థానిక బస్టాండ్ ముందున్న పెద్దబావి వద్ద గంగిపూజను నిర్వహించి భజన,మేళాతాళాలతో ఊరేగింపుగా వచ్చి దేవత దేవాలయంలో కుంభాన్ని ప్రతిష్టాపించారు.దేవతకు పూల,ఆకులతో ప్రత్యేకంగా ఆలంకరణ చేశారు.భక్తులు విరిగా హజరై ప్రత్యేకంగా పూజలు చేసి మహామంగళారతి పూజలు చేశారు.దేవికి నైవేధ్యం సమర్పించారు.మోక్కుబడులు తీర్చుకుని ధైవ దర్శనం చేసుకున్నారు.భక్తులు ఆధిక సంఖ్యలో హజరైయ్యారు.వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు./ కార్యక్రమంలో తోటద సిద్దప్ప,ఈరప్ప,ఉమాపతి,వీరేశ్,చిన్నప్ప,బసవ, శేఖరప్ప, రుద్రప్ప, గాదిలింగ,జీజీ బసవ,జాంటీ వీరేశ్,టిపుడు సిద్దప్ప,మాటసూగురు ఈశ్వరప్ప, అమరేశప్ప, జగదీశ్,వీరభద్రి,తోటద వీరేశ్,విరేంద్ర,విజయ్,శరణప్ప,సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

# స్వదేస్ స్కీం కింద రూ.25 కోట్లు మంజూరు

### ఆళ్లగడ్డను అభివృద్ధి దిశగా తీసుకొని పోవడమే మా లక్ష్యం


పెన్షన్లు పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డను అభివృద్ధి దిశగా తీసుకొని పోవడ మే మా లక్ష్యం అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మునిసిపాలిటి పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామంలో పెన్షన్ ని పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. వ్వ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల్లో ఒకటో తారీకు వచ్చిందంటే పండగ వాతావరణం కనబడుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్క హామీలను నెరవేరుస్తోందని అన్నారు. అహోబిలానికి స్వదేస్ స్కీం కింద 25 కోట్ల రూపాయలు మంజూరు అయిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఆగస్టు 15 నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ఇలాంటి అభివృద్ధి పనులు చూడ లేక వైసీపీ నాయకులు మాపై బురదజల్లే మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఆళ్లగడ్డలో అభివృద్ధి చేయలేదు అంటున్నారని మీరు వైసీపీ ప్రభుత్వంలో మొదటి సంవత్సరం ఎంత అభివృద్ధి పనులు చేశారో చూపించండన్నారు. మేము ప్రభుత్వం వచ్చాక మొదటి సంవత్సరం ఎంత అభివృద్ధి చేశామో చూపిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే సొంత ఊర్లో కూడా కోటి 40 లక్షల రూపాయలతో గురువారం బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. అదే మా ఊరు అయితే వైసీపీ నాయకులు చేసేవారా అని నేను అడుగుతున్నానన్నారు. మాకు ప్రజలందరూ ఒకటే ఆళ్లగడ్డను అభివృద్ధి దిశగా తీసుకొని పోవడమే మా లక్ష్యమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధికి అభివృద్ధి కోసం మూడు కోట్లు మంజూరు చేయడం జరిగిందని, అలాగే మంత్రి నారాయణ ఇంకా కొన్ని సమస్యలు ఉండడంతో 30 లక్షల రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆళ్లగడ్డ అంటే అభివృద్ధిలో అమరావతి వరకు వెళ్లేలాగా చేసి చూపిస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఈనాడు సీఎం చంద్రబాబు నాయుడు గండికోట పర్యటనలో భాగంగా శిలాఫలకాన్ని ప్రారంభం చేయబోతున్నారన్నారు. అలాగే చింతకుంట్ల గ్రామ ముస్లిం సోదరుల కోసం కాంపౌండ్ వాల్ సీఎం చంద్రబాబు నాయుడును అడిగి మంజూరు చేపిస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నా రు. కౌన్సిలర్ హుస్సేన్ బాష, సిద్దంరెడ్డి జఫర్ రెడ్డి, చింతకుంట రామశేఖర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చందన్స్ అనోరెక్టర్ ఆయుర్వేద హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి ఫరూక్


ఆయుర్వేద హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

**నంద్యాల నూనెపల్లె, మేజర్ న్యూస్ :** పట్టణంలోని సంజీవనగర్ కోదండ రామాలయం ఎదురుగా చందన్స్ అనోరెక్టర్ ఆయుర్వేద హాస్పిటల్‌ను న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శుక్రవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా డాక్టర్ కెపీ హరి చందన్ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో పలు వ్యాధులకు ప్రత్యేక చికిత్సల ద్వారా నయం చేయడం జరుగుతుందని అన్నారు. పురాతన పద్ధతుల్లో క్షౌర సూత్ర, క్షౌరకర్మ, పంచకర్మ, తదితర పద్ధతుల ద్వారా వ్యాధులకు చికిత్స చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే 2వ తేదీ శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పలు వ్యాధులతో బాధపడుతున్న వారు తమ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని చికిత్సలు పొందాలని, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. లూటీ, మొలలు, పిలోనిడల్ ఫైనల్, ధీర్ఘకాలిక వ్రణం, నరాల వాపు, కీళ్ళ నొప్పులు, సయాటీకాలకు చికిత్స చేయడం జరుగు తుందని తెలిపారు. అలాగే జలధెరపి, కప్పింగ్,హిజామ,పొట్టలి స్వేద, పరిషేకం,శిరోధార, అభ్యంగ, కటిస్వేద పద్ధతులలో చికిత్స చేయడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో నంద్యాల బులియన్ అసోసియేషన్ మర్చెంట్ ప్రసిడెంట్ గంగిశెట్టి విజయ్‌కుమార్, ప్రొఫెసర్ డాక్టర్ ఎం భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా గుడికి వెండి కంచెం సమర్పణ


దాతలను సత్కరిస్తున్న బాబా ఆలయ కమిటీ సభ్యులు

**డోన్, మేజర్‌న్యూస్ః** పట్టణంలోని కొండపేట కు చెందిన జి.భాస్కర్ గౌడ్, అరుణజ్యోతిలమ నువరాలు జిఈ. దేవినం దిత జన్మదినం సందర్భంగా శుక్రవారం అహోబిలం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారికి రూ. 1,50,000ల విలువగల ఆభరణాలతోపాటు డోన్ పట్టణ సమీపంలోని శ్రీసాయిబాబా గుడికి రూ.43వేలు విలువ చేసే వెండి కంచెంను సమర్పించారు. ఈ సందర్భంగా డోన్ సాయిబాబా కమిటీ సభ్యులు ఆలా మల్లికార్జునరెడ్డి, సిఎం శ్రీనివాసులు, శాంతి టైపు ఇన్స్టిట్యూట్ శ్రీరాములు, టీచర్ సుబ్బారెడ్డి, కందుకూరి పార్ధసారధిలు సాయిబాబాకు వెండి కంచెం ఇచ్చి దాతృత్వాన్ని భక్తిని చాటుకున్న ఏనుగుమర్రి భాస్కర్‌గౌడ్ దంపతులను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు జిఈ.నవీన్‌సింహ, లక్ష్మిశ్వేతామృత, నందన్‌సింహ, వైష్ణవీదేవి, దేవినందిత, సభ్యులు చిట్యాల లోకేశ్వర్‌గౌడ్, సందు నాగరాజు, రంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గూడెంలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

### – యర్రమటం పిహెచ్‌సిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే జయసూర్య


ఆరోగ్య కేంద్రంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** కృష్ణా నదికి సమీపంలో ఉన్న గిరిజన గూడెంలను అభివృద్ధి చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. శుక్రవారం మండలంలోని జానాలగూడెం, బలపాలతిప్ప, పాత సిద్ధేశ్వరం, కొత్తపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే జయసూర్య సుడిగాలి పర్యటన చేశారు. నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం యర్రమటం ప్రాధమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని మందులను, పరిసరాలను పరిశీలించారు. వైద్యశాల అద్వానంగా ఉందని వైద్య సిబ్బంది సక్రమంగా వైద్యశాలలో సేవలు అందించడం లేదని సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం వైద్యులు వైద్యశాలలో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య మట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు తెలిపారు. రూ.3 వేల పింఛన్‌ను రూ.4 వేలకు పెంచిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఇప్పటికే తల్లికి వందనం పథకం కింద అర్హులైన వారికి బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అయినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు, పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. జీవనోపాధి కల్పించాలని గూడెంవాసులు వినతిపత్రం సమర్పించారు. గూడెంలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉమారాణి, మండల కన్వీనర్ నారపు రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు, నాంపల్లి సొసైటి చైర్మెన్ నాగేశ్వర్ యాదవ్, టీడీపీ నాయకులు చంద్రా రెడ్డి, శివా రెడ్డి, సుధాకర్, కృష్ణా రెడ్డి, రమణ, రహీం ఖాన్, లింగన్న, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పారా సైక్లింగ్ ర్యాంకింగ్‌లో ప్రథమ స్థానానికి చేరుకున్న అర్షద్

- పారా సైక్లింగ్ లో అంతర్జాతీయ పతకాలు సాధించిన నంద్యాల దివ్యాంగ క్రీడాకారుడు
- అభినందించి సత్కరించిన మంత్రి ఫరూక్



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** థాయిలాండ్ లో చియాంగ్ మయి నగరంలో జూలై నెలలో యూనియన్ సైక్లింగ్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో థాయిలాండ్ పారా సైక్లింగ్ అసోసియేషన్ నిర్వహణలో జరిగిన రెండవ లానా పారా సైక్లింగ్ కప్ ఛాంపియన్ షిప్ లో ఆదిత్య మెహతా ఫౌండేషన్ తరపున పాల్గొన్న నంద్యాల దివ్యాంగ పారా సైక్లింగ్ క్రీడాకారుడు వివిధ కేటగిరీలలో ట్రాక్ మరియు రోడ్డు సైక్లింగ్ పోటీలలో 12 బంగారు పతకాలు సాధించాడు. అర్షద్ ఈ విజయాలతో ప్రపంచ పారా సైక్లింగ్ ర్యాంకింగ్ లో ప్రథమ స్థానానికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ నిర్వహణలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ క్యాంప్ ఆఫీసులో జరిగిన అభినందన కార్యక్రమంలో మంత్రి ఫరూక్ అర్షద్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ అర్షద్ చిన్నతనంలో ప్రమాదంలో కాలు కోల్పోయినప్పటికీ క్రీడల పట్ల మక్కువతో వివిధ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం నంద్యాలకు, రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. అర్షద్ సాధించిన విజయాలు దివ్యాంగులకు స్ఫూర్తిదాయకమన్నారు. చిన్నప్పటి నుండి అర్షద్‌ను డాక్టర్ రవి కృష్ణ ప్రోత్సహించాడని అభినందించారు. రాష్ట్ర నూతన క్రీడా విధానంలో అంతర్జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారులు, దివ్యాంగ క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించబడ్డాయని, అర్షద్ ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దగ్గరికి తీసుకువెళ్లి మంచి ఉద్యోగం రావడానికి సహకరిస్తానన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ అర్షద్ పారా సైక్లింగ్ లోనే కాకుండా, పర్వతారోహణలో మౌంట్ భగీరధి అధిరోహించాడని, అదేవిధంగా స్విమ్మింగ్, బాడీ బిల్డింగ్, వీల్ చైర్ ఫెన్సింగ్ , ఆర్చరీ వంటి క్రీడలలో కూడా రాష్ట్ర జాతీయ స్థాయిలో పతకాలు సాధించి ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా నిలిచాడని అన్నారు. అర్షద్ మాట్లాడుతూ ఈనెల బెల్జియంలో జరగనున్న ప్రపంచ రోడ్డు సైక్లింగ్ ఛాంపియన్ షిప్ లో పాల్గొనడానికి వెళ్తున్నానని తెలిపాడు. తెలుగుదేశం పార్టీ నంద్యాల అధ్యక్షుడు ఖలీల్ మనియార్, తెలుగుదేశం పార్టీ నాయకుడు జిలాని, అర్షద్ తండ్రి ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# లారీడ్రైవర్ కొడుకు కానిస్టేబుల్ పరీక్షల్లో జిల్లా టాపర్

- కానిస్టేబుల్ పరీక్షల్లో ప్రతిభ
- తెలంగాణలో ఏఎయస్‌పి పోలీస్ ఎంపికలో స్టేట్ సెకెండ్ ర్యాంక్
- ఆంధ్ర కానిస్టేబుల్ పరీక్షలో జిల్లా టాపర్
- తెలంగాణలో విధులు కొనసాగిస్తూ కానిస్టేబుల్‌కు ఎంపిక
- పేదింటి వాల్మీకి ఆణిముత్యం



తల్లిదండ్రులతో జిల్లా టాపర్ శ్రీరాములు



జిల్లా టాపర్‌గా నిలిచిన లారీడ్రైవర్ కొడుకు శ్రీనివాసులు

**కోసిగి మేజర్ న్యూస్:** కోసిగి మండలంలో అత్యధికంగా వాల్మీకులున్నా.. అక్షరాస్యతలో మాత్రం పూర్తిగా వెనుకబడి ఉన్న వర్గం నుండి పేదింటి వాల్మీకి ఆణిముత్యం కానిస్టేబుల్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి జిల్లా టాపర్‌గా నిలవడంతో కోసిగి పేరును జిల్లా టాప్‌లో నిలపడం జరిగింది. అదికూడా ఓ లారీ డ్రైవర్ కొడుకు ఈ ప్రతిభ చాటడంతో మండలంలో పెద్దెత్తున హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఓ లారీడ్రైవర్ కొడుకు ఇలాంటి ఘనత సాధించడం సంతోషకరమని, సంతోషం వ్యక్తంచేసి అభినందిస్తున్నారు. కోసిగి గ్రామానికి చెందిన రంగప్పగట్టు కాలనీలో నివాసమున్న దుర్గిగేని తిక్కయ్య లారీ డ్రైవర్ తల్లి నాగమ్మ అనే దంపతులకు దుర్గిగేని శ్రీరాములు అనే యువకుడు 200మార్కులకుగాను 159మార్కులు సాధించి కానిస్టేబుల్ పరీక్షల్లో జిల్లా టాపర్‌గా నిలిచారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఎపియస్‌పి కానిస్టేబుల్‌గా ఎంపికై విధులు కొనసాగిస్తున్నారు. విధులు కొనసాగిస్తూ ఆంధ్రలో జరిగిన కానిస్టేబుల్ పరీక్షకు హాజరై అత్యధిక ప్రతిభ కనబర్చి జిల్లా టాపర్‌గా నిలిచారు. తెలంగాణ రాష్ట్రంలో గత రెండు సంవత్సరాల క్రితం జరిగిన కానిస్టేబుల్ ఎంపిక ల్లో కూడా తెలంగాణ రాష్ట్ర రెండవ ర్యాంక్‌ను సాధించి ఓపెన్‌ఖలో ఎపియస్‌పి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. దీననికంటే ముందుగా యస్‌ఐ పరీక్షలకు ఎంపికై సీనియార్టీ విభాగం కింద యస్‌ఐ జాబ్‌ను కోల్పోవడం జరిగిందని శ్రీరాములు తెలిపారు. తన లక్ష్యం యస్‌ఐగా ఎంపికవ్వాలని తమ అభిప్రాయాన్ని తెలిపారు. ప్రస్తుతం లారీ డ్రైవర్ తిక్కన్న హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు పాఠశాలలో స్కూల్ బస్ డ్రైవర్‌గా పనిచేయడం జరుగుతుంది.

# జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి

- ఇళ్ల స్థలాలు కూడా వెంటనే ఇవ్వాలి
- ఆగస్టు 5న జర్నలిస్టుల డిమాండ్ డే
- జయప్రదం చేయాలని ఏపియూడబ్ల్యూజే పిలుపు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభు త్వం ఏర్పడి ఏడాది గడిచినా అర్హులైన జర్న లిస్టులకు నేటికీ కొత్త అక్రిడేషన్లు ఇవ్వలేదని, మూడు నెలలకు ఒక్కసారి పొడిగిస్తూ వస్తూనే ఉందని, ఈసారి పొడిగించకుండా కొత్త అక్రిడేషన్లు ఇవ్వాలని ఏపి యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపియూడబ్ల్యూజే) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎన్‌వి సుబ్బయ్య, జిల్లా సలహాదారులు వైవీ క్రిష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.ఎన్ రాజు, కె శ్రీనివాస్‌గౌడ్, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కె నాగరాజు, ఏపియూడబ్ల్యూజే రాష్ట్ర సమితి సభ్యులు మధుసుధన్‌గౌడ్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి అంజి, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, జిల్లా సహాయ కార్యదర్శులు అవినాష్, వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తుందని ఆశించామన్నారు. అయితే ఆశించిన స్థాయిలో లేదన్నారు. ముఖ్యంగా కొత్త అక్రిడేషన్లు ఇవ్వడంలో వాయిదాల మీద వాయిదాలు వేస్తూ పోతుందన్నారు. గత ప్రభుత్వ విధానాల వల్ల ఎంతోమంది అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ సౌకర్యం కోల్పోయారని, ఈ ప్రభుత్వం రాకతో అందరికీ కొత్త అక్రిడేషన్లు వస్తాయని ఆశించారన్నారు. అయితే ఏడాది పూర్తయినా కొత్త అక్రిడేషన్లు ఇవ్వకుండా పొడిగిస్తూ వస్తోందన్నారు. దీంతో అర్హత ఉండి కూడా చాలామంది అక్రిడేషన్లకు నోచుకోలేకపోతున్నారన్నారు. ప్రధానంగా హెల్త్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే అక్రిడేషన్ కావాల్సి వస్తోందన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ఇక పొడిగించకుండా కొత్త అక్రిడేషన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టులకు యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని, యాంటీ అటాక్ కమిటీలు వెంటనే వేయాలని కోరారు. అలాగే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందని ద్రాక్షగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా జర్నలిస్టులకు ఎన్నికల సమయంలో కాకుండా తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి కూడా సహకరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న జర్నలిస్టు డిమాండ్స్ డే నిర్వహించాలని రాష్ట్ర కమిటీ ఆదేశించిందన్నారు. కావున జర్నలిస్టులు అన్ని కేంద్రాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# స్టాండింగ్ కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేత



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులకు కమీషనర్ పి విశ్వనాథ్ నియామక పత్రాలు అందచేశారు. శుక్రవారం నగర పాలక కార్యాలయంలో మేయర్ బివై రామయ్య, కమీషనర్ విశ్వనాథ్‌ల చేతుల మీదుగా సభ్యులు డిక్లరేషన్ ఫాంలను అందుకున్నారు. నూతనంగా ఎన్నికైన అహమ్మద్ షేక్ 50వ వార్డు, నారాయణ రెడ్డి ఇప్పల 28వ వార్డు, మునెమ్మ కురువ 43వ వార్డు, వెంకటేశ్వర్లు 34వ వార్డు, సాంబశివరావు చెన్నబోయిన 39వార్డు సభ్యులకు మేయర్ రామయ్య, కమీషనర్ విశ్వనాథ్‌లు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఆర్‌జీవి కృష్ణ, మేనేజర్ చిన్న రాముడు, కార్పొరేటర్ క్రిష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీని కలిసిన మహిళా నూతన డిఎస్పీ



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ఎమ్మిగనూరు డిఎస్పీగా పనిచేస్తూ సాధారణ బదిలీలలో భాగంగా మహిళా పోలీసుస్టేషన్‌కు నూతన డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎం. ఉపేంద్రబాబు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీ మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీకి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదివరకు పనిచేస్తున్న పూర్వపు డిఎస్పీ కె శ్రీనివాసాచారి గుంతకల్ రైల్వేకు బదిలీ కావడం జరిగింది. మహిళలు, బాలికలపై జరిగే నేరాల పట్ల ప్రత్యేక దృష్టి సారించి అరికట్టేందుకు కృషి చేస్తామని, శక్తి యాప్, శక్తి వాట్సప్ గురించి, మహిళా చట్టాలపై కళాశాలల్లో, పాఠశాలల్లో మహిళల భద్రతే లక్ష్యంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

# ఒక మాసంలో రెగ్యూలర్ జిల్లా రిజిస్ట్రార్

– రిజిస్ట్రార్ డిఐజి పిజిఎస్ కళ్యాణి

**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** కర్నూలు నగరంలోని జిల్లా రెగ్యులర్ రిజిస్టర్ నియామకం ఒక మాసంలో నియమిస్తున్నట్లు ఉప ఇన్‌స్పెక్టర్ జనరల్(డిఐజి) పిజిఎస్ కళ్యాణి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు రెగ్యులర్ జిల్లా రిజిస్టర్ కావాలని గత 11నెలల క్రితం ప్రభుత్వానికి నివేదికలు అందచేశామని ఒక నెలలో రెగ్యులర్ జిల్లా రిజిస్టర్ నియామకం జరుగుతుందని తెలియజేశారు.

# రైతుల ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** అన్నదాత సుఖీ భవ పథకాన్ని ఆగస్టు 2వ తేదీ నుంచి ప్రభు త్వం అమలు చేస్తుందని మండల వ్యవసా యాధికారిని మధుమతి తెలిపారు. మండల వ్యాప్తంగా 9588మంది రైతులకు రూ.19,17,60,000లు రానుండగా మొదటి విడతలో రూ.6,71,16,000లు రైతులు లబ్ది పొందనున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సహాయం ప్రతిఒక్క రైతు ఖాతాలో జమ కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నేడు ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి పాణ్యంలో ప్రారంభించనున్నారని తెలిపారు.

# విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

– కూటమి సుపరిపాలనపై ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(మెయిన్) విద్యార్థులకు ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి తన సొంత నిధులతో శుక్రవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ నెల 4న ఎమ్మెల్యే జన్మదినం సందర్బంగా ప్రతి ఏడాది పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుంది అందులో భాగంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను కూటమి ప్రభుత్వం రూపుదిద్దుతుందని, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే ప్రతి విద్యార్థికి కూడా క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా..లేదా..అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా పాఠశాల హెచ్‌ఎం ఆదినారాయణ రెడ్డి పాఠశాలకు కాంపౌండ్ వాల్, డ్రైనేజీ వల్ల పాఠశాలలోకి పాములు, తేళ్లు వస్తున్నాయని తదితర సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నన్నూరు పాఠశాలతో పాటు మండల వ్యాప్తంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాసులు, మండల ఎంఈఓలు ఓంకార్ యాదవ్, శ్రీధర్ బాబు, ఏపిజె టీఎఫ్ యూనియన్ నాయకులు ఇస్మాయిల్, నన్నూరు సింగిల్‌విండో చైర్మన్ నాగేశ్వరరెడ్డి, టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, ప్రతాప్ రెడ్డి, పట్టేలా మోహన్, సర్కార్ ఖాజామియా, శంషుద్దీన్, పెద్ద మునిస్వామి, అయ్యన్న, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్లు తదితరులున్నారు.



# ఇండియన్ పాలిటి

# భారతరాజ్యాంగ ప్రవేశిక
# భారత రాజ్యాంగం - ఆధారాలు

**భారత రాజ్యాంగ ప్రవేశిక :** భారత రాజ్యాంగం రాజ్యాంగ ప్రవేశికతో ప్రారంభ మవుతుంది .

- 1946 డిసెంబర్ 13న నెహ్రూ ప్రవేశపెట్టిన 'రాజ్యాంగ లక్ష్యాలు - ఆశయాల' తీర్మానానికి ప్రాతిపదిక గా చెప్పవచ్చు .
- ఆశయాల తీర్మానాన్ని రాజ్యాంగ పరిషత్తు 1947 జనవరి 22 వ తేదిన ఏకగ్రీవంగా ఆమోదించింది . ఈ రాజ్యాంగ ప్రవేశిక భావనను - అమెరికా నుండి గ్రహించారు.
- రాజ్యాంగ ప్రవేశికను రూపొందించడంలో - ఫ్రెంచి విప్లవం (1789) నుండి స్వేచ్ఛ - సమానత్వం-సౌభ్రాతృత్వం, రష్యా విప్లవం (1917) నుండి సాంఘిక, ఆర్థిక , రాజకీయ న్యాయము అనే అంశాల ద్వారా ప్రేరణ పొంది రూపొందించాము .
- ప్రవేశిక భారత ప్రజలమైన మేము అనే పదం ద్వారా ప్రారంభం అవుతుంది. దీనినే పీఠిక, అవతారిక 'preamble' అని కూడా అంటారు .
- ప్రవేశిక భారత దేశాన్ని " సర్వసత్తాక , సామ్యవాద, లౌకిక ,ప్రజాస్వామ్య గణతంత్ర," రాజ్యంగ పేర్కొంది.
- 1976 లో 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశిక లో సామ్యవాద, లౌకిక మరియు సమగ్రత అనే పదాలను చేర్చారు .

1. **సర్వసత్తాక / సార్వభౌమ రాజ్యం :** భారత దేశం బాహ్యంగాను, అంతరంగికంగాను తిరుగులేని అధికారంను కలిగి ఉంది. మన దేశం సర్వ స్వతంత్ర మైనది, ఎలాంటి విదేశీ జోక్యానికి గురికాదు, విదేశీ జోక్యాన్ని సహించదు.
2. **సామ్యవాద రాజ్యం :** ఈ పదాన్ని సోవియట్ యునియన్ నుండి స్వీకరించారు. 1976 లో 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో పొందు పరిచారు. సామ్యవాదం అంటే సమసమాజ స్థాపన , ప్రజల మధ్యన ఆర్థిక అంతరాలను తొలగించి ఆర్థిక న్యాయాన్ని ,సమానత్వాన్ని సాధించడం.
3. **లౌకిక తత్త్వం :** 1976 లో 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో పొందుపరిచారు. లౌకిక రాజ్యం అనగా 'మతప్రమేయం లేని రాజ్యం'. మత విషయంలో పౌరులకు స్వేచ్ఛ ఉంటుంది. మన రాజ్యానికి అధికారిక మతం అంటూ ఉండదు. అన్ని మతాలు సమానమే. SR బొమ్మై VS యునియన్ ఆఫ్ ఇండియా కేసులో (1994 ) లో సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ లౌకిక తత్త్వం భారత రాజ్యంగా ప్రవేశిక మౌలిక లక్షణంగా పేర్కొంది.
4. **ప్రజాస్వామ్య రాజ్యం :** ప్రజాస్వామ్య రాజ్యం అనగా "ప్రజలచేత, ప్రజల కొరకు, ప్రజల వలన ఏర్పడిన ప్రభుత్వం అని అర్థం. ఇందులో ప్రజలే పాలకులు , ప్రజలే పాలితులు.

- అమెరికా మాజీ అధ్యక్షుడు - అబ్రహం లింకన్ ' By the people , for the people , of the people' అని నిర్వచించాడు.
- నిర్ణీత వయస్సు కలిగిన వారు ఓటు హక్కు ద్వారా ప్రభుత్వాన్ని ఎన్నుకొంటారు .

5. **గణతంత్ర రాజ్యం :** గణం అంటే ప్రజలు. తంత్రం అంటే పాలన అని అర్థం. గణతంత్ర రాజ్యం అనగా సర్వోన్నత అధికారం ప్రజలయందు కాని, ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రతినిధుల యందు గాని ఉన్న రాజ్యాంగం. భారత దేశం రిపబ్లిక్ విధానము ను ఫ్రాన్స్ దేశం నుండి గ్రహించింది. 1950 జనవరి 26న మన దేశం గణతంత్ర రాజ్యంగా అవతరించింది. భారత రాష్ట్రపతి ప్రజల చేత పరోక్షంగా నిర్ణీత కాలానికి ఎన్నికవుతారు.

## ప్రాక్టీస్ ప్రశ్నలు

**1. కింద ఇచ్చిన వాక్యాలలో సరైనవి ఎంచుకోండి**

I. భారత రాజ్యాంగ ప్రవేశిక భావనను అమెరికా రాజ్యాంగం నుండి గ్రహించాము.

II. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సార్వభౌమ అనే పదాన్ని ప్రవేశికలో చేర్చారు.

III. భారత రాజ్యాంగ ప్రవేశికలో ఉన్న సామ్యవాద భావన సోవియట్ యూనియన్ నుండి వచ్చింది.

A. కేవలం I మరియు II
B. కేవలం I మరియు III
C. కేవలం II మరియు III
D. I, IIమరియు III

Ans: B

( II తప్పు సార్వభౌమ అనే పదం ప్రారంభం నుంచే ఉంది. 1976 సవరణలో సామ్యవాద, లౌకిక, సమగ్రత పదాలు చేర్చారు)

**2. కింద ఇచ్చిన వాక్యాలలో సరైనవి ఎంచుకోండి**

I. ప్రవేశికలో పేర్కొన్న "లౌకిక" భావన మత నిరపేక్షతకు సంకేతం.

II. లౌకికత భారత రాజ్యాంగంలోని ప్రాథమిక లక్షణం కాదు.

III. SR బొమ్మై కేసులో సుప్రీంకోర్టు లౌకికతను ప్రాథమిక లక్షణంగా పేర్కొంది.

A) కేవలం I మరియు III
B) కేవలం II మాత్రమే
C) కేవలం I మరియు II
D) పైవన్నీ సరైనవే

Ans: A


( II తప్పు - లౌకికత మౌలిక లక్షణమే)

**3. కింద ఇచ్చిన వాక్యాలలో సరైనవి ఎంచుకోండి**

I. గణతంత్రం అంటే ప్రజలచే ఎన్నుకోబడే పాలక వ్యవస్థ.

II. భారత్ 1949 నవంబర్ 26న గణతంత్ర దేశంగా ప్రకటించబడింది.

III. గణతంత్ర భావనను ఫ్రాన్స్ దేశం నుండి




స్వీకరించారు.

A) కేవలం I మరియు III
B) కేవలం II మరియు III
C) కేవలం I మాత్రమే
D) I, II, III అన్నీ సరైనవి

Ans: A

( II తప్పు - భారతదేశం 1950 జనవరి 26న గణతంత్ర దేశంగా అవతరించింది)

**4. కింద ఇచ్చిన వాక్యాలలో సరైనవి ఎంచుకోండి**

I. ప్రవేశికలో పేర్కొన్న ప్రజాస్వామ్యం భావనకు అబ్రహాం లింకన్ నిర్వచనం ప్రాముఖ్యమైనది.

II. ప్రజాస్వామ్యం అనేది ప్రజలచే, ప్రజల కోసం, ప్రజలకోసమే ఉండే పాలన.

III. ప్రజాస్వామ్య రాజ్యంలో రాష్ట్రపతి వారసత్వాధికారిగా నియమించబడతారు.

A) కేవలం I మరియు II
B) కేవలం II మరియు III
C) కేవలం I మరియు III
D) I, II, III అన్నీ సరైనవి

Ans: A

( III తప్పు - ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల చేత ఎన్నుకోబడుతుంది, వారసత్వ పద్ధతి కాదు)

**5. కింద ఇచ్చిన వాక్యాలలో సరైనవి ఎంచుకోండి**

I. ప్రవేశిక పీఠిక అనే పదానికి సమానార్థకం.

II.ప్రవేశికన్యాయదృష్ట్యా రాజ్యాంగంలో భాగం కాదు.

III. 1976 సవరణ ద్వారా లౌకిక అనే పదాన్ని చేర్చారు.

A) I మరియు III
B) II మరియు III
C) కేవలం II
D) I, II, III అన్నీ సరైనవి

Ans: A

( II తప్పు - ప్రవేశిక రాజ్యాంగ భాగమే, సుప్రీం కోర్టు తీర్పుల ద్వారా ఇది స్పష్టమైంది)

**6. కింది వాటిలో సరికాని జత ఏది?**

A) ఫ్రాన్స్ - గణతంత్ర విధానం
B) జర్మనీ - అత్యవసర పరిస్థితులు
C) కెనడా - లిఖిత రాజ్యాంగం
D) USSR - సామ్యవాద భావన

Ans: C

కెనడాలో లిఖిత రాజ్యాంగం ఉన్నా భారత రాజ్యాంగంలోని లిఖిత రూపం అమెరికా నుండి తీసుకోబడింది .

**7. కింది జతలలో తప్పు ఏది?**

A) ఆస్ట్రేలియా - ఉభయ సభల సంయుక్త సమావేశం
B) అమెరికా - రాష్ట్రపతి తొలగింపు తీర్మానం
C) బ్రిటన్ - ద్విసభా వ్యవస్థ
D) కెనడా - న్యాయ సమీక్ష

Ans: D న్యాయ సమీక్ష అమెరికా నుండి తీసుకోబడింది

**8. ఈ క్రింది వాటిలో సరయైనవి ఏవి ?**

I. 356వ ఆర్టికల్ భావన భారత ప్రభుత్వం చట్టం 1935 నుంచే వచ్చింది.

II. ఉమ్మడి జాబితా మరియు సహకార సమాఖ్య భావనలను కెనడా నుంచి తీసుకున్నారు.

III. ఫెడరల్ కోర్టు స్థాపన బ్రిటన్ రాజ్యాంగం ఆధారంగా జరిగింది.

IV. గవర్నర్ విచక్షణ అధికారాలు 1935 చట్టం నుంచే పొందినవి.

A) I, IV B) I, II
C) I, III, IV
D) I, IV మాత్రమే

ANS : A

(II ఉమ్మడి జాబితా మరియు సహకార సమాఖ్య భావనలను ఆస్ట్రేలియా నుంచి; III - ఫెడరల్ కోర్టు స్థాపన 1935 చట్టం నుంచి తీసుకున్నారు )

**9. ఈ క్రింది వాటిలో సరయైనవి ఏవి ?**

I. ప్రాథమిక హక్కులు అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహించారు

II. రాజ్యాంగ సవరణ ప్రక్రియ (ఆర్టికల్ 368) స్విట్జర్లాండ్ నుంచి తీసుకున్నది.

III. స్వతంత్ర న్యాయ వ్యవస్థ భావన అమెరికా నుంచి తీసుకున్నారు.

IV. రాజ్యాంగ అధిక్యత భావన USSR నుంచి తీసుకున్నారు.

A) I, III B) I, II, III
C) I, III, IV D) I మాత్రమే

ANS : A

(II-రాజ్యాంగ సవరణ ప్రక్రియ (ఆర్టికల్ 368) దక్షిణాఫ్రికా నుంచి రాజ్యాంగ అధిక్యత భావన అమెరికా నుంచి తీసుకున్నారు )

సత్య ఇర్గదిండ్ల
SATYA SIR APP
9177323403




## భారత రాజ్యాంగం ఆధారాలు - వివిధ దేశాల నుంచి గ్రహించిన అంశాలు

- **1935 భారత ప్రభుత్వం** : కేంద్ర రాష్ట్ర సంబంధాలు , గవర్నర్ విచక్షణ అధికారాలు,ఫెడరల్ కోర్టు, పబ్లిక్ సర్వీస్ కమిషన్స్, సమాఖ్య వ్యవస్థ, రాష్ట్రపతి పాలన - 356 నిబంధన,
- **బ్రిటన్ రాజ్యాంగం :** పార్లమెంటరీ ప్రభుత్వం, ద్విసభ పద్ధతి, సమన్యాయ పాలన, శాసన నిర్మాణ ప్రక్రియ, స్పీకర్, డిప్యూటి స్పీకర్, CAG, అటార్నీ జనరల్, ఏక పౌరసత్వం, రిట్లు జారీచేసే విధానం , శాసన సభల సభ్యుల హక్కులు.
- **అమెరికా రాజ్యాంగం :** ప్రాథమిక హక్కులు, లిఖిత రాజ్యాంగం, న్యాయ సమీక్ష, ప్రవేశిక, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయ వ్యవస్థ, ఉపరాష్ట్రపతి పదవి రాష్ట్రపతిని తొలగించే మహాభియోగ తీర్మానం, రాజ్యంగ సవరణ బిల్లుకు రాష్ట్రాల ఆమోదం, రాజ్యాంగ ఆధిక్యత.
- **ఐర్లాండ్ రాజ్యాంగం:** ఆదేశిక సూత్రాలు, రాష్ట్రపతిని ఎన్నుకునే నైష్పత్తిక ప్రాతినిధ్యం, ఒక ఓటు బదిలీ పద్ధతి, రాజ్య సభకు విశిష్ట సభ్యుల నియామకం (12 మందిని ), న్యాయ సంరక్షణ, న్యాయ సంరక్షణ లేని హక్కులు .
- **ఆస్ట్రేలియా రాజ్యాంగం :** ఉమ్మడి జాబితా, ఉభయ సభల సంయుక్త సమావేశం, అంతరాష్ట్ర వ్యాపారము , సహకార సమాఖ్య .
- **వైమర్ రిపబ్లిక్ (జర్మనీ)** : జాతీయ అత్యవసర పరిస్థితి, ప్రాథమిక హక్కులను రద్దు చేసే అధికారం
- **పుర్వపు USSR (రష్యా)** : ప్రాథమిక విధులు , సామ్యవాద సూత్రాలు, ప్రవేశిక లోని సామాజిక , ఆర్థిక, రాజకీయ న్యాయం.
- **కెనడా** : అవశిష్ట అధికారాలు, గవర్నర్‌లను నియమించే పద్ధతి, బలమైన కేంద్ర ప్రభుత్వం, 143 నిబంధన ప్రకారం సుప్రీంకోర్టు సలహాను రాష్ట్రపతి కోరడం .
- **ఫ్రాన్స్** : స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, గణతంత్ర విధానం, తాత్కాలిక సభాధ్యక్షుల నియామకం .
- **జపాన్** : చట్టం నిర్దేశించిన పద్ధతి , 21 వ నిబంధన లోని జీవించే హక్కు .
- **దక్షిణాఫ్రికా** : రాజ్యాంగ సవరణ పద్ధతి ( 368 ) , రాజ్య సభ సభ్యుల ఎన్నిక పద్ధతి .
- **స్విట్జర్లాండ్** : ప్రధానమంత్రి, మంత్రి మండలి, సమిష్టి బాధ్యత.

# కూటమి ప్రభుత్వం సంక్షేమంలో ముందడుగు.. కాతా

**నూతన వితంతు పెన్షన్లు పంపిణీ**

**మిడుతూర్ మేజర్ న్యూస్:** మిడుతూరు మండల కేంద్రంలో మరియు గ్రామాలలో నూతన వితంతు పెన్షన్లను పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల్లో తన నిబద్ధతను చాటుకుంటూదని మండల టిడిపి కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి అన్నారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ, సంక్షేమ కార్యక్రమాలను విస్మరించకుండా పేద, అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు కూటమి ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తుందని ఈ క్రమంలో,మండల కేంద్రంలో కాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో మరియు బైరాపురం గ్రామంలోసీనియర్ నాయకుడు చెరుకుచేర్ల రఘురామయ్య గ్రామాల నాయకులుకూటమి నేతలతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లను స్వయంగా పంపిణీ చేశారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్ కింద ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ స్కీమ్ ద్వారా వృద్ధు



లు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం అందించబడుతోంది. ఈ పథకం కింద వితంతువులకు,వృద్ధులకు నెలకురూ.4,000, వికలాంగులకు రూ.6,000, పూర్తి వైకల్యం ఉన్న వారికి దీర్ఘకాలిక వ్యాధుల తో బాధపడేవారికి రూ.10,000 వరకు పెన్షన్ అందించబడుతోంది. ఈ పెంచిన పెన్షన్ మొత్తాలు 2024 జులై నుండి అమలులోకి వచ్చాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని విస్మరించకుండా పేద ప్రజల సంక్షేమం కోసం అవిశ్వాంత్రగాకృషి చేస్తోంది. పెన్షన్ల పంపిణీలో పారదర్శకత, సమయపాలనను నిర్ధారించడం ద్వారా ప్రభుత్వం ప్రజలకు సేవ చేస్తోంది" అని అన్నారు.ప్రతి నెలా మొదటిరోజు ఉదయం 9గంటలలోపు 80% మంది లబ్ధిదారులకు పెన్షన్లు చేరేలా చేయడం, 98% పంపిణీ ని మొదటి రోజే పూర్తి చేయడం వంటి విధానాలు ప్రభుత్వ పారదర్శకతను, సమర్థతను తెలియజేస్తున్నాయి.ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమాన్ని కొనసాగిస్తూ,వచ్చారు గత ప్రభుత్వంలో పెన్షన్ లు పెంచడానికి ఐదేళ్ల కాలం పట్టిందని ప్రజలు ఇప్పటికైనా ఏ ప్రభుత్వం బాగా పనిచేస్తుందో తెలుసుకోవాలని కాతా రమేష్ రెడ్డి అన్నారు.ఇన్చార్జి ఎంపీడీవో సురేష్ కుమార్ గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# వైయస్ జగన్ నెల్లూరు పర్యటనలో ప్రభుత్వ తీరు హాస్యాస్పదం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** వైకాపా అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటనలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర వైసీపీ కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నెల్లూరు పర్యటనకు వచ్చిన వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు వెళ్లిన నాయకులు, కార్యకర్తలపై పోలీసులు వ్యవహరించిన తీరు విచారకరమన్నారు. జిల్లా పోలీసులనే కాక చెన్నై, హైదరాబాద్ కు చెందిన ప్రైవేటు బౌన్సర్లను కూడా జగ





మాట్లాడుతున్న భూమా కిషోర్ రెడ్డి

న్ పర్యటనలో వినియోగించుకోవడం జరిగిందన్నారు. కూటమి పాలన చేసే పాలనతో విసిగిపోయిన ప్రజలు వైయస్ జగన్ కు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ప్రజలందరూ వైయస్ జగన్పై నమ్మకంతో ఉన్నారన్నారు. రోడ్డు వేయాల్సిన ప్రభుత్వమే జగన్ పర్యటనలో ఉన్న రోడ్లనే త్రవ్వడం జరిగిందన్నారు. లోకేష్ రెడ్ బుక్ పరాకాష్టకు చేరుకుందన్నారు. కూటమి పాలకుల చేష్టలు సింగపూర్, అమెరికాకు కూడా తెలిసిపోయాయని అందుకే రాష్ట్రంలో పెట్టుబడులుపెట్టేందుకు ఎవరు ముందుకు రావడం లేదన్నారు. స్థానిక విషయానికి వస్తే ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ఎర్రగుడిదిన్నె వద్ద బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంగుల సొంత ఊరిలోనే బ్రిడ్జి పనులకు భూమి పూజ చేశామని చెప్పడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేకు ప్రతి గ్రామము సొంత ఊరు లాంటిదని ఓటు వేసినా వేయకపోయినా ప్రతి గ్రామానికి సేవ చేయాల్సిందేనని హితవు పలికారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తాను బిజెపిలో ఉన్నానని నా సొంత ఊరికే 8 కోట్లతో రహదారులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.వైకాపా ప్రభుత్వం కులం, మతం, ప్రాంతం చూడకుండా అభివృద్ధి చేసిందనడానికి ఇదొక నిదర్శనం అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందరికీ అందజేసే బాధ్యత ఎమ్మెల్యే పై ఉందని విడదీసే రాజకీయాలు మాట్లాడవద్దని ఎమ్మెల్యేకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు అంబటి మహేశ్వర్ రెడ్డి, సర్వాయి పల్లె రాజా తదితరులు ఉన్నారు.

# మళ్లీ పంట పొలాల్లో చిరుత సంచారం

**భయాందోళనలో రైతులు, గ్రామస్థులు**

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండలంలోని గంజహళ్లి, ఎన్నెకండ్ల గ్రామాలలో చిరుత శుక్రవారం ఉదయం వంట పొలాల లోసంచరించింది. దీంతో ఉదయం పొలం పనులకు వెళ్లిన రైతులు భయాం దోళనకు గురయ్యారు. పంట పొలాలలో కనిపించడంతో భయంతో రైతులు తమ గ్రామాల వైపు పరుగులు తీశారు. గత వారం రోజుల నుంచి ఈ రెండు గ్రామాల మధ్యం చిరుత సంచరిస్తుంది. గతంలో ఎన్నెకండ్ల గ్రామానికి చెందిన రైతు దున్నపోతు పై దాడి చేసి చంపి తిన్న సంఘటన జరిగింది. గత ఐదు రోజుల క్రితం పారెస్టు అధికారులు సంఘటన స్థలంను పరిశీలించి




చిరుత ఏమి చేయదు మీరు దాని జోలికి వెళ్ల వద్ద అంటు సలహా ఇచ్చి వెళ్లిపోయారు. అయితే మళ్లీ శుక్రవారం ఉదయం రెండు గ్రామాల మధ్యం ఉన్న పంట పొలాలో పనులు చేస్తున్న రైతులకు చిరుత కనిపించడంతో రైతులు దూరంగా పారిపోయారు ఈ విషయంను గంజహళ్లి గ్రామ సర్పంచ్ రాముడు పారెస్టు అధికారులకు సమాచారం అందించారు. అయితే వారు తగు రీతి లోస్పందించలేదనిరాముడు ఆవేదన వ్యక్తం చేశాడు.రాముడు,గ్రామస్థులు మాట్లాడుతూ రాత్రి పూట గ్రామాలలోకి వస్తే మా పరస్థితి ఏమిటనివారు ప్రశ్నిస్తున్నారు. పారెస్టు అధికారులు నిర్లక్ష్యంగా సమాదానం ఇస్తున్నారని వారు అన్నారు. గ్రామంలో గుంపులు గుంపులుగా చేరి గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంట పొలాలకు మహిళలు, పిల్లలు ఒంటరిగా వెళ్లేందుకు భయపడుతున్నారని పెద్దవారు కూడా గుంపులుగా వెళ్లాల్సి వస్తుందని గ్రామస్థులు పేర్కొంట ఉన్నారు. ఇప్పటికై పారెస్టు అధికారులు స్పందించి చిరుతను పట్టుకొని ఆభయారణ్యాలలో వదిలివేయాలని కోరుతున్నారు.

# కానిస్టేబుల్ ఫలితాల్లో సత్తా చాటిన మండల యువకులు

**వెల్దుర్తిరూరల్, మేజర్న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాలలో పత్తికొండ నియోజకవర్గం, వెల్దుర్తి మండల యువకులు సత్తా చాటారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామానికి చెందిన కురువ కొత్తమిద్దె రాముడు కుమారుడు సురేష్ , కొమ్ము జయరాముడు, తల్లి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కొమ్ము నవీన్(ఏపిఎస్పి కానిస్టేబుళ్ళుగా), అదేవిధంగా సిద్దనగట్టు గ్రామం నుండి మాదాస్ మాధవ తులసిరెడ్డి (సివిల్ కానిస్టేబుల్), వడ్ల రామాంజినేయులు(సివిల్ కానిస్టేబుల్)గా, ఎల్.తాండ గ్రామానికి చెందిన దేవప్పనాయక్, శాంతిభాయ్ దంపతుల కుమారుడు శ్రీధర్నాయక్(కానిస్టేబుల్), అలాగే స్వామినాయక్, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు గణేష్నాయక్(కానిస్టేబుల్)గా సత్తా చాటారు. దీంతో వారివారి గ్రామాలలో కుటుబం సభ్యులు, బంధువర్గం సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన గ్రామపెద్దలు, గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేసి, వారిని అభినందించారు.















# పోలీసు కానిస్టేబుల్ గా ఎంపికైన పెద్దకడుబూరు యువతి



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు గ్రామానికి చెందిన కటికె ఉస్మాన్. దౌలత్బీ దంపతులకు జన్మించిన కూమార్తె సుభాన్బి ఇటీవల జరిగిన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో తన సత్తాచాటింది. అయితే ఈ పరీక్ష ఫలితాల్లో అమెకు 121 మార్కులతో సివిల్ కానిస్టేబుల్గా ఉద్యోగం సాధించింది.దీంతోతన కుమార్తెకు పోలీసు ఉద్యోగంరావడంతో తల్లి దండ్రుల తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అలాగే మాగ్రామానికి చెందిన యువతికి సివిల్ పోలీసు కానిస్టేబుల్ గా ఎంపికైనందుకు గ్రామంలోని ప్రజలు అబినందనలు తెలిపారు.

# మండలంలో 93 శాతం పెన్షన్ పంపిణీ పూర్తి..ఎంపీడీవో

**పాములపాడు మేజర్ న్యూస్ :** మండలం పరిధిలోని అన్ని గ్రామాలలో. ఉదయం ఏడు గంటల నుంచి సచివాలయ సిబ్బందితో పాటు రెవెన్యూ సిబ్బంది ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు అని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు మండలంలో5731 పెన్షన్లకు కాను 5323 పెన్షన్లు పంపిణీ చేశామని కొత్తగా వారికి 103 పెన్షన్లు మంజూరు అయ్యాయని తెలిపారు స్థానిక నాయకులతో కలిసి పాములపాడు మండల కేంద్రంలో ఆయన పెన్షన్ పంపిణీ కార్యక్రమం చేశారు ఈ కార్యక్రమంలో విఆర్ఓ శివన్న, సర్పంచ్ మేకల భాగ్యమ్మ, నబి రసూల్, జలాల్ సాహెబ్ రాజశేఖర్ ఉస్మాన్ భాష, తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబు పేదల పక్షపాతి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ఏపీ సీఎం చంద్రబాబునాయుడు పేదల పక్షపాతి అని మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, బేతాలబడేసా, సింగిల్ విండో అధ్యక్షుడు రామాంజినేయులు,అడ్వకేట్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గోనెగండ్ల లో కొత్తగా ఫింఛన్ అందుకున్న లబ్దిదారులు సీఎం చంద్రబాబునాయుడి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



సీఎం చంద్రబాబు చిత్రపటకు క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్ లబ్ధిదారులు, నాయకులు

ఆయన చేసిన మేలు జీవితంలో మరువమని వారు అన్నారు. అలాగే మండల పరిధిలోని పలు గ్రామాలలో మంగవారం సచివాలయం సిబ్బంది పింఛన్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు.వృద్ధులు, వితంతువులకు రూ. 4వేలు ఇచ్చారు. అలాగే వికలాంగులకు రూ.6వేల అందజేశారు. గోనెగండ్ల మండల వ్యాప్తంగా 28 గ్రామాలలో దాదాపు 95 శాతం పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు.పింఛన్ సొమ్ముతో అవ్వతాతలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమీ నాయకులు రంగస్వామినాయుడు, బీజేపీ నాయకులు మునిస్వామిగౌడ్, నాయుడు, రహంతుల్లా, జనసేన నాయకులు గానుగబాషా, మాలిక్ బాషా, వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**హెచ్ కైరవాడిలో:** మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలో కొత్తగా ఫించన్ మంజూరై లబ్దిదారులు గ్రామ సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం ఎర్పడి ఏడాది లోనే మండలంలో జరిగిన అభివృద్ధిని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు గురునాథ్ రెడ్డి, రాజేస్, పెద్దయ్య, శ్రీ నివాసులు కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఐరన్ బండ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను తెలుగుయువత మండల ఉపాధ్యాక్షుడు ముల్లా బాషా, అల్లాబకాష్ రామాం జినేయులు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మాకు నష్టపరిహారం ఇప్పించండి

**పాణ్యం, మేజర్న్యూస్ :** గ్రీన్కో సంస్థ చేపట్టిన సోలార్ నిర్మాణ పనులలో కోల్పోతున్న తమ పొలాలకు నష్టపరిహారం ఇప్పించాని చెంచులు కోరారు. శుక్రవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ పిన్నాపురం పరిధిలోని 283/1 సర్వే నెంబరులో జయంపు హనుమంతు పేరున 4.32 ఎకరాలు, 284/1 సర్వే నెంబరులో 5.20 ఎకరాలు రెవెన్యూ రికార్డులలో నమోదైనట్లు తెలిపారు. కాగా హనుమంతు మృతి చెందడంతో ఈ భూములను గత మూడేళ్ల క్రితం అక్రమంగా ఇతరుల పేరున ఆన్లైన్ చేసి పలువురు కాజేయాలనుకొన్నట్లు చెంచులు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ భూములపై హనుమంతు వారసులు కోర్టుకు వెళ్లినట్లు తెలిపారు. అఆలగే 283/2 సర్వే నెంబరులో 1.22 ఎకరాలు, 284/2 సర్వే నెంబరులోని ఏడబ్ల్యూ ల్యాండ్లో గత 20 ఏళ్లుగా జయంపు మద్దయ్య, నిమ్మల ఉసేని, ఇండ్ల మద్దమ్మలు సాగు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాగా ఇటీవల ఈ భూములలో దౌర్జన్యంగా సోలార్ కంచెను ఏర్పాటు చేయడానికి ప్రయత్నించడంతో చెంచులు అడ్డుకున్నట్లు తెలిపారు. చెంచులు తమ భూములకు నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని అన్నారు. మేము పాణ్యంలో నివాసం ఉంటూ ఈ భూములను సాగు చేసుకునేవారమని అన్నారు. ప్రస్తుతం మేము వారి వారసులుగా భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని నష్టపరిహారం ఇచ్చి భూములు స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వాన్ని, గ్రీన్కో సంస్థను కోరారు.



సూర్య
www.suryaa.com



# అహోబిలంలో ఘనంగా స్వాతి వేడుకలు






**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. నల్లమల అరణ్యంలో వెలసిన నవనరసింహులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామున నుండే నవనారసింహులను దర్శించు కునేందుకు కాలినడకన తరలి వెళ్లారు. జ్వాలా,అహోబిల, మాలోల క్రోడా, కారంజ భార్గవ, యోగానంద, చిత్రపట,పావన నరసింహస్వాములను దర్శించుకున్నారు. కాలినడకన స్వామి దర్శించుకునే భక్తుల కోసం పావన, వరాహ, అహోబిల, యోగానంద తదితర క్షేత్రాలలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దిగువ అహోబిల ప్రాంగణంలో ఉత్సవ మూర్తులైన శ్రీ ప్రహల్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం అందరం స్వామి వాళ్ళ ఎదుట సుదర్శన హోమం వేదమంత్రాలు మధ్య నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులం దరికీ కాటుకను, హోమరక్షలను అందజేశారు.

**స్వాతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే**

**గంగుల :** పుణ్యక్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో స్వాతి హోమం జరిగింది. ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల నాని పాల్గొన్నారు. ఆలయంలో కొలువు దీరిన శ్రీ ప్రహ్లాద వరద స్వామి అమృతవల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న స్వాతి సుదర్శన హోమంలో పాల్గొన్నారు. ప్రధానఅర్చకులు ఆయనకు నరసింహ కంకణాలు అందజేశారు.

# జిల్లా కలెక్టర్ చొరవతో కొత్తగా వితంతు పెన్షన్లు

**- ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన జిల్లా కలెక్టర్**




**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా చొరవతో రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ తీసు కుంటూ భర్తలు చనిపోయిన వారికి కొత్తగా వితంతు పెన్షన్లను మంజూరు చేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 8 వేల మందికి వితంతువులకు కొత్తగా పెన్షన్లు మంజూరు అయ్య యి.అలాగే జిల్లాలో3502 మందికి వితంతుపెన్షన్‌లు మంజూరు అయ్యాయి.గతంలో చిన్న టేకూరు గ్రామానికి పెన్షన్ పంపిణీ చేసేందుకు జిల్లా కలెక్టర్ వెళ్లిన సందర్భంగా కురువ అంజనమ్మ, బోయ లక్ష్మీదేవి అనే మహిళలు జిల్లాకలెక్టర్‌తో మాట్లాడుతూపెన్షన్‌తీసుకుంటూ తమభర్తలు చనిపోయారని, అందువల్ల తమ కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ కలెక్టర్ల కాన్ఫరెన్స్లో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, పెన్షన్ తీసుకుంటూ భర్తలు చనిపోయిన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై ముఖ్య మంత్రి సానుకూలంగా స్పందించి, అలాంటి వారికి పెన్షన్ మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తత్ఫలితంగానే రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 8 వేల మందికి వితంతువులకు కొత్తగా పెన్షన్లు మంజూరు అయ్యయి. అలాగే జిల్లాలో 3502 మందికి వితంతు పెన్షన్‌లు మంజూరు అయ్యాయి.. చిన్నటేకూరు గ్రామంలో కురువ అంజనమ్మ, బోయ లక్ష్మీలతో పాటు,మరో పదకొండు మంది వితంతువులకు కూడా కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయి. ఇందుకు జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.ఆనాడు తమకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరిన కురువ అంజనమ్మ, బోయ లక్ష్మీదేవిలకు శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో కలెక్టర్ పెన్షన్ మంజూరు పత్రం, పెన్షన్ మొత్తాలను అంద చేశారు. ఈ సందర్భంగా కురువ అంజనమ్మ, బోయ లక్ష్మీదేవి మాట్లాడుతూ ముఖ్య మంత్రి, జిల్లా కలెక్టర్ చొరవ వల్లే తమకు, తమతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 8వేల మందికి మంచి జరిగిందని కృతజ్ఞతలు తెలిపారు.

# ఏది నిజం.. ఎందుకు ఈ నిర్లక్ష్యం

- విధుల పట్ల అలసత్వం తగదు..
- సాయంత్రం 4 గంటలకు విధులకు హాజరు..
- జీతం మాత్రం ఫుల్.. రోజు ఇదే తంతేనేమో..!!
- తీసుకుంటున్న వేతనానికి న్యాయం చేయండి




**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** సమాజంలో పత్రికల్లో వచ్చే శీర్షికలు భిన్నాభ్రాయాలను ఆలోచింపజేస్తాయి. ప్రతి వ్యక్తి తనకు నచ్చిన విధంగా వార్తలు ప్రచురణ చేస్తే పాత్రికేయుడు మంచివాడు. తప్పు చేసిన వ్యక్తిని విమర్శిస్తూ వార్త ప్రచురణ చేస్తే చెడ్డవాడు అవుతాడు. సామాజిక బాధ్యత కలిగి విలువలతో కూడిన విలేకర్లు ఉన్నారు. ఇది జగమెరిగిన సత్యం. ప్రభుత్వ ఉన్నతాధికారులు పత్రికలలో వచ్చే వార్తలపై సమగ్ర విచారణ చేసుకుని తప్పు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు చేపట్టినప్పుడు మరలా ఆ సమస్య పునరావృతం కాకుండ ఉంటుంది. కర్నూలు కలెక్టర్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖపై నేటి దినపత్రిక సూర్య గత నెల 12వ తేదీన ఈ వైఫల్యం ఎవరిది అనే శీర్షిక ప్రచురితం చేసింది. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖలో ఏఏ సెక్షన్లకు తాళాలు వేశారో..ఆ సెక్షన్ల ఇంచార్జ్‌లను సంప్రదించి వివరణ కోరడం జరిగింది. అందులో హెల్త్ ఎడ్యుకేటర్ మాత్రం కార్యాలయంలో విధులు మా ఇష్టం..తాళం వేసిన ఫోటోలు తీయకూడదని..ఏమి రాసుకుంటారో రాసుకోండి..అని ఒక బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారి నిర్లక్ష్యంగా వివరణ ఇచ్చారు. విధులు బాధ్యతాయుతంగా నిర్వహిస్తే ప్రశ్నించే వార్తలు ప్రచురణ కావు కదా. ఉదాహరణకు జిల్లా మరియు వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం హెల్త్ ఎడ్యుకేటర్ సెక్షన్‌కు ఉదయం నుండి సాయంత్రం 4గంటల వరకు ఆ సెక్షన్‌కు పనినిమిత్తం వచ్చే వారికి తాళం వేసిన గది దర్శనమిస్తుంది. కార్యాలయంలోని హెల్త్ ఎడ్యుకేటర్ ఎక్కడ అని నేటి దినపత్రిక సూర్య పాత్రికేయుడు సమాచారం అడుగగా సిబ్బంది ఆరోగ్యం బాగోలేక విధులకు రాలేదని మధ్యాహ్నం వస్తారన్నారని తెలిపారు.

**హెల్త్ ఎడ్యుకేటర్ వివరణ :** ఈ విషయమై హెల్త్ ఎడ్యుకేటర్‌ను విలేకరి చరవాణి ద్వారా శుక్రవారం సెలవులో ఉన్నారా అని ప్రశ్నిస్తే ఆ అధికారి సెలవులోలేనని సమాధానం చెప్పారు. ఉదయం విధులకు రాలేదని మర్యాదగా ప్రశ్నించగా బయటకు వెళ్లామని ఆ అధికారి చెప్పారు. ఆరోగ్యం బాగోలేదని మధ్యాహ్నం వస్తారన్నారంటా అని అడుగగా ఆ అధికారి తలనొప్పిగా ఉంటే రాలేదని అయినా ఎక్కడెక్కడో తిరుగుతుంటాం మీకెందుకు చెప్పాలి అని అన్నారు. ఆఫీస్ నుండి ఫోన్ వస్తే మీటింగ్‌కు వెళ్లానని అధికారి తెలిపారు. అయినా చిన్న చిన్న వాటిపై ఎందుకు రాస్తారని హెల్త్ ఎడ్యుకేటర్ మండిపడ్డారు. ఇందులో మధ్యాహ్నం వరకు సెలవులో ఉన్నారా..? లేక మీటింగ్‌కు వెళ్లారా..? ఆరోగ్యం బాలేక రాలేదా..?ఏది నిజం తెలియాల్సి ఉంది.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి

**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న జిల్లా కలెక్టర్

**పత్తికొండ, మేజర్‌న్యూస్ :** పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పత్తికొండ మండలం దూదేకొండ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన, మధ్యాహ్న భోజనం, పుస్తకాల పంపిణీ గురించి ఆరా తీశారు. అనంతరం 6వ తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ, ప్రతి రోజు మీకుమెనూ ప్రకారంగా భోజనం పెడుతున్నారా, మీరందరూ ప్రతి రోజు ఇక్కడే భోజనం చేస్తున్నారా, రుచిగా ఉందా..? యూనిఫాంలు, నోట్ బుక్స్ టెక్స్ట్ బుక్స్, షూస్ ఇచ్చారా..? టీచర్లు పాఠాలు ఏవిధంగా చెబుతు న్నారు. అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారని, స్కూలులోనే భోజనం చేస్తున్నామని భోజనం బాగుందని, యూనిఫాం, బుక్స్ ఇచ్చారని ఉపాధ్యాయులు పాఠాలు బాగా చెబుతున్నారని విద్యార్థులు కలెక్టర్‌కు సమాధానమిచ్చారు. 4వ తరగతి గదికెళ్ళి పిల్లలకు ఇంగ్లీష్ పాఠాలు బోధించారు. విద్యార్థులు బాగా చదువు కోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ వంట గదిని పరిశీలిస్తూ, భోజనం రుచికరంగా ఉండేలా చేయాలని వంట సిబ్బందికి ఆదేశించారు. కట్టెలపొయ్యితో వంట చేయడం చూసి గ్యాస్ స్టౌ తెప్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, డిఆర్‌డిఏ పిడి రమణారెడ్డి, తహాశీల్దార్ హుసేన్ సాహేబ్, ఎంపిడిఓ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసాతో.. పేదల కళ్ళల్లో ఆనందం



ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్‌చ, టీడీపీ పార్టీ పరిశీలకులు నరసానాయుడు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో అయ్యలూరు గ్రామ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ సర్పంచ్ త్రిలింగేశ్వరరెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ అందజేసిన రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు. ఈసందర్భంగా మంత్రి ఫరూక్, టీడీపీ అధికార ప్రతినిధి నరసానాయుడులు మాట్లాడుతూ పింఛన్ పంపిణీ చేసినప్పుడు లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం కనిపించిందన్నారు. ఐదేళ్లు గడిపి వైయస్ జగన్ మాట తప్పారని ఏటా రూ.250లు పెంచుతూ ప్రజలను నమ్మకద్రోహం చేశారని నేడు మా అధినేత సీఎం నారా చంద్రబాబు నాయుడు చెప్పిన మాట ప్రకారం రూ.3వేలు నుంచి రూ.4వేలు పెంచుతూ మూడు నెలల ముందే ప్రతినెల వెయ్యి చొప్పున మొత్తం కలిపి రూ.7వేలు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి నెలలోనే పంపిణీ చేశామ్నారు. నంద్యాలలో అన్ని వార్డులలో, గ్రామాల్లో టీడీపీ నాయకులు దగ్గర ఉండి లబ్ధిదారులకు పింఛన్ అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ అధికారులకు, టీడీపీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ప్రజలకు అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రతిపరెడ్డి, రాయపురెడ్డి, హుశేన్‌వలి, మాజీ మండల ఉపాధ్యక్షుడు వీరభద్రుడు, ఓబులేసు, వరుణ్ , టీడీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, కెసి కెనాల్ చైర్మన్ చాబోలు ఇలియాస్, మిద్దె హుశేన్, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.